విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :118 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 16 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## పరస్పర సున్నితత్వం పాటించాలి

- జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ
- బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ
- పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని మోదీ స్పష్టీకరణ
- భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి
- శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉందాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి




## యూపీఐపై వడ్డన!

- ఉచిత లావాదేవీల విధానానికి కేంద్రం చెల్లుచీటీ.. వ్యాపారులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధింపు
- వ్యక్తుల నుంచి వ్యాపారులకు రూ. 2 వేలకుపైగా యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం చార్జీ
- రూ. 75 వేలు మించిన యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ. 300గా ఖరారు
- రైల్వే, టెలికం, బీమా, ఇంధన రంగాలకు రూ. 2 వేలకుపైగా జరిపే చెల్లింపులపై రూ. 5 చార్జీ
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలు, చిరు వ్యాపారులకు మాత్రం ఉచితం
- ఎండీఆర్‌ను కస్టమర్ల నుంచి వసూలు చేయరాదని.. వ్యాపారులే భరించాలని స్పష్టీకరణ
- అక్టోబర్ 15 నుంచి అమల్లోకి.. కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్

## కోచింగ్ కేంద్రాలు రాజకీయ కుట్రలకు
# వేదిక కాకూడదు




- కోచింగ్ కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలను సహించబోం
- అభ్యర్థులను రాజకీయ ఆందోళనలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవు
- కోచింగ్ కేంద్రాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు
- నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలి
- ముఖ్యంగా జీవో నెంబరు 9లోని నిబంధనలకు అనుగుణంగానే సంస్థల నిర్వహణ ఉండాలి

అమరావతి

పోటీ పరీక్షల కోచింగ్ ముసుగులో రాజకీయ ఆటలు సాగితే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రాజకీయ ప్రేరేపిత ఆందోళనలకు కోచింగ్ కేంద్రాలు అడ్డాగా మారొద్దని సీఎం స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టపరంగా కొరడా ఝుళిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారంపై సమీక్ష నిర్వహించిన సీఎం కోచింగ్ కేంద్రాల కార్యకలాపాలపై క్షేత్రస్థాయిలో నిఘా పెంచాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులను కొన్ని ప్రైవేటు కోచింగ్ సంస్థలు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అభ్యర్థులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆందోళనలు, నిరసనల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న వ్యవహారంపై అధికారులు సీఎంకు వివరించారు. పరీక్షల కోసం శిక్షణ పొందాల్సిన యువతను రాజకీయ కార్యక్రమాల్లోకి లాగడం

వివరాలు 2లో..



## పాక్‌కు ఇలాంటి జిమ్మిక్కులు కొత్తేం కాదు

- మసూద్ అజర్ రివార్డ్‌పై భారత్?
- జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్‌పై రూ.70 లక్షల బహుమతి ప్రకటించిన పాక్
- ఇలాంటి ప్రకటనలు గతంలోనూ చూశామన్న భారత్
- ఉగ్రవాదంపై పాక్ కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ



## మోదీ మళ్లీ రాజీపడ్డారు

- అమెరికా ఒత్తిడికి లొంగిపోయారు
- యూపీఐ ఛార్జీలపై కాంగ్రెస్ ఫైర్
- యూపీఐ చార్జీల విషయంలో కేంద్రంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు
- రూ.2 వేల వరకు యూపీఐ లావాదేవీలకే ఫీజు మినహాయింపు ఎందుకని ఖర్గే ప్రశ్న
- అమెరికా ఒత్తిడికి మోదీ తలొగ్గరన్న రాహుల్




## ఏపీలో పురపాలక ఎన్నికల నిర్వహణపై
# ఈసీ ఫోకస్

- ఈ నెల 22న వార్డుల వారీగా ఓటర్ల జాబితా
- రాష్ట్రంలో 12 నగరపాలికలు, 29 పురపాలికల్లో ఓటర్ల జాబితా తయారీకి ఎస్ఈసీ కసరత్తు పూర్తి
- ఈ మేరకు 2 ప్రత్యేక నోటిఫికేషన్లపై ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా సంతకాలు
- పురపాలక ఎన్నికల దిశగా ఈసీ అడుగులు

## శ్రీవారిసేవలో
# సీఎం చంద్రబాబు

- తిరుమలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు దంపతులు
- తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాల వేళ శ్రీవారికి సీఎం చంద్రబాబు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు
- కుటుంబసభ్యులతో కలిసి ఆయన తిరుమలకు తరలివచ్చారు
- సీఎం హోదాలో 16వ సారి ఆయన తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా నిలిచి, అభివృద్ధిలో ముందుండేలా స్వామివారు ఆశీస్సులు అందించాలి
- శ్రీవారి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



అమరావతి

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇవాళ సాయంత్రం 6.21 గంటల నుంచి 6.35 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళ వాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని, పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్,

వివరాలు 2లో..



## మనం ఇంకా సిద్ధం కాలేదు.. ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి

- బిల్ గేట్స్ అనూహ్య వ్యాఖ్యలు
- ఏఐ వృద్ధి నియంత్రణ అవసరమని పిలుపునిచ్చిన బిల్ గేట్స్
- ఇంతటి భారీ మార్పుకు మనం సిద్ధంగా లేమని వ్యాఖ్య
- సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందని హెచ్చరిక
- ఏఐపై ఆందోళన వ్యక్తం చేసిన ఎలాన్ మస్క్, శామ్ ఆల్ట్‌మన్
- సమానత్వం కోసం ఏఐపై 1 బిలియన్ డాలర్లు కేటాయించిన గేట్స్ ఫౌండేషన్

## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత

- మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ కన్నుమూశారు
- విశాఖలో నేడు గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు
- జగన్ హయాంలో డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.



# ఏపీలో పురపాలక ఎన్నికల నిర్వహణపై ఈసీ ఫోకస్

ఏపీలో పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా మరో 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఫారం–1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను ఈనెల 22న ప్రకటించాలని తెలిపారు. 2026 జనవరి 1ని అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా రూపకల్పన చేయాలని సూచించారు.

మొత్తం 17 నగర పాలక సంస్థలకు గాను విజయనగరం కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగా పూర్తి కావడంతో అక్కడ సెప్టెంబర్ 3 నాటికే ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తయింది. అలాగే ఏపీలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తైన 58 చోట్ల కూడా సెప్టెంబరు 3నే జాబితాలను వెల్లడించారు. మిగిలిన 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబర్ 14 నుంచి 17 మధ్య పూర్తి కానున్నందున – ఆయా చోట్ల ఓటర్ల జాబితా ప్రచురణకు కొత్త తేదీని ఖరారు చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సెప్టెంబర్ 13న ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.




రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని ఎస్?ఈసీ పరిశీలించింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 22ను ప్రచురణ తేదీగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. తాజా ఓటర్ల జాబితాల ప్రచురణతో ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సిద్ధమవుతోంది. మేయర్లు, పురపాలక ఛైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేయడానికి సర్కార్?కి మరింత మార్గం సుగమం కానుంది. సంబంధిత కార్పొరేషన్ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# రాజకీయాలలో కులాల పట్టింపులు

**ఏలూరు** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. సహజంగానే ఏపీ రాజకీయాలలో కులాల పట్టింపులు ఎక్కువగా ఉంటాయి. ఎన్నికల సమయంలో ఇవి ఎక్కువ ప్రభావం చూపిస్తుంటాయి. 2024 లో జరిగిన ఎన్నికల్లో ఏపీ రాష్ట్రంలో జనసేన, బిజెపి, టిడిపి కలిసి పోటీ చేశాయి. కూటమిగా ఏర్పడి అధికారాన్ని దక్కించుకున్నాయి. మూడు పార్టీలకు కూటమి ప్రభుత్వంలో సముచిత ప్రాధాన్యం లభించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ఏపీ అభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీలకు తన ప్రాధాన్యం దక్కే విధంగా ఆయన అడుగులు వేస్తున్నారు. మూడు పార్టీల అధినాయకులు ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం ఉండే విధంగా ఆలోచనలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి మరో విధంగా ఉంది. కొంతమంది ఎమ్మెల్యేలు.. మిగతా నాయకులు వేరే విధంగా వ్యవహరిస్తున్నారు. వైసిపికి లాభం చేకూర్చే విధంగా మాట్లాడుతున్నారు. సహజంగానే ఇలాంటి అవకాశం కోసం వైసిపి ఎదురుచూస్తూ ఉంటుంది. పైగా ఆ పార్టీ చేతిలో మీడియా ఉంది. అందువల్లే జనసేన, టిడిపి, బిజెపి లో దిగువ స్థాయి నాయకుల అసంతృప్తి వ్యాఖ్యలకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తూ ఉంది. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ప్రజల్లో నాయకులు చులకన అవుతారు. కానీ ఆ విషయం కూటమిలోని పార్టీల కిందిస్థాయి నాయకులకు అర్థం కావడం లేదు. తాజాగా జనసేన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ఎన్నికల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. జనసేన గెలిచిన చోట టిడిపి వాళ్ళను గౌరవిస్తున్నామని.. టిడిపి వాళ్ళు గెలిచిన చోట జనసేన నాయకులను గౌరవించడం లేదని.. ఈ సమస్య మీద




నేరుగా ఒకే చంద్రబాబు.. పవన్ కళ్యాణ్ తో మాట్లాడుతామని శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు. గడచిన కొంతకాలంగా కార్య కర్తల బాధ చూశామని.. ఇకపై వారు బాధపడకుండా చూసు కుంటామని శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యకర్తల ప్రవర్తన ఆధా రంగా టికెట్లు కేటాయిస్తామని.. స్థానిక ఎన్నికల్లో గెలిపించు కునే బాధ్యతను భుజాలకు ఎత్తుకుంటామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఇటువంటి వ్యాఖ్యలను అంతర్గతంగా చేసుకోవాలి. సాధారణంగా ఒక కుటుంబంలో ఎన్నో సమస్యలు ఉంటాయి.. సానుకూల ధోరణిలో మాట్లాడుతూ ఉంటే ఆ సమస్యలు పరిష్కారం అవుతూ ఉంటాయి. కూటమిగా ఉన్న మూడు పార్టీలలో కూడా సమస్యలు లేవని కాదు. కాకపోతే వాటిని సానుకూల దృక్పథంతో చర్చించుకుంటే బాగుంటుంది. అలాకాకుండా ఇలా అసంతృప్తి వ్యక్తం చేస్తుంటే సమస్యలు వెలుగు చూస్తూనే ఉంటాయి. ఇక్కడ జనసేన నాయకులకు టిడిపి ఎమ్మెల్యేలు గౌరవం ఇవ్వాలి. వాళ్ల సమస్యలను పరిష్కరించుకోవాలి. ఏదైనా ఉంటే కలిసి మాట్లాడుకోవాలి. అలాకాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే మొదటికే మోసం వస్తుంది. స్థానిక ఎన్నికల సమయంలో ఇటువంటి ధోరణి కొనసాగిస్తే కూటమికి మొదటికే మోసం వస్తుంది.

# కేశినేని చిన్న కొడుకు పొలిటికల్ ఎంట్రీ..

**విజయవాడ** : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కుమారుడు వెంకట్ రాజకీయాల్లోకి వస్తున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఆయన మేయర్ రేసులో ఉన్నారంటూ కొంతమంది పోస్టులు పెట్టారు. ఈ ప్రచారంపై ఎంపీ చిన్ని స్పందించారు. తన కుమారుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. తన కుమారుడు ప్రస్తుతం వ్యాపార కార్యలకలాపాలలో ఉన్నట్లు తెలిపారు విజయవాడ ఎంపీ చిన్ని. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) కుమారుడు వెంకట్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతు న్నారా?. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారా? అంటూ కొద్దిరోజులుగా కేశినేని చిన్ని కుమారుడి పొలిటికల్ ఎంట్రీపై సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. వెంకట్ విజయవాడ మేయర్ రేసులో ఉన్నారంటూ కొంతమంది సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెట్టారు. తాజాగా ఈ అంశంపై ఎంపీ కేశినేని చిన్ని స్పందించారు.. తన కుమారుడి రాజకీయ ప్రవేశంపై స్పష్టత ఇచ్చారుతన కుమారుడు కేశినేని వెంకట్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని.. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టత ఇచ్చారు ఎంపీ కేశినేని చిన్ని. వెంకట్ ప్రస్తుతం తన వ్యాపార కార్యకలాపాలకు మాత్రమే పరిమితం అయ్యారని.. క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారని తెలిపారు. కాబట్టి ఇటువంటి నిరాధారమైన ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని



విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విజ్ఞప్తి చేశారు. విజయవాడ మేయర్ రేసులో 'జెన్ జీ' మార్క్.. కేశినేని వెంకట్ బాబు విజన్ అండ్ మిషన్ అంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. విజయవాడ నగర కార్పొరేషన్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కుమారుడు కేశినేని వెంకట్ మేయర్ రేసులో నవతరం ఆలోచనలకు ప్రతీకగా, 'జెన్ జీ' ప్రతినిధిగా రంగంలోకి దిగుతున్నారన్నారు. నగర యువత ఆకాంక్షలను చట్టసభలు, పాలనా వేదికలపై వినిపించేందుకు సిద్ధమవుతున్నారనేది ఆ పోస్ట్ సారాంశం. అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహనతో విజయవాడను సాంకేతికతతో అనుసంధానించిన 'స్మార్ట్ సిటీ'గా మార్చడమే ప్రధాన ధ్యేయమని పోస్ట్‌లో ప్రస్తావించారు. ?యువత ? ఉపాధి ? స్కిల్ హబ్స్: స్థానిక యువత కోసం ఐటీ/స్టార్టప్ అవకాశాలు పెంపొందించడం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు స్థాపించడం మరియు క్రీడా ప్రాంగణాలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఎంపీ కేశినేని చిన్ని ప్రజాసేవా నిబద్ధతతో డివిజన్ల వారీగా స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతారన్నారు. ?పచ్చదనం ఙ ఆధునిక మౌలిక వసతులు: భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, ఆధునిక పారిశుధ్య యాజమాన్యం, సులభతర రవాణా మరియు కెనాల్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు స్పష్టమైన రోడ్ మ్యాప్ ఉందన్నారు. ?సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా పరిపాలనలో వేగం, పారదర్శకత తీసుకొస్తూ.. విజయవాడ నగర అభివృద్ధికి సరికొత్త దిశానిర్దేశం చేయడానికి వెంకట్ బాబు రాక నగరంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోందని ప్రచారం చేస్తున్నారు. ఈ పోస్టులపై కేశినేని చిన్ని స్పందించారు.. తన కుమారుడి పొలిటికల్ ఎంట్రీపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని.. క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారని స్పష్టత ఇచ్చారు.

## ఆరు లైన్లు రహదారి అడుగులు

**గుంటూరు** : తెలుగు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన రహదారుల్లో నేషనల్ హైవే 65 ఒకటి. తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లే కీలకమార్గాల్లో ఒకటైన ఈ హైదరాబాద్– విజయవాడ మధ్య రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర రహదారి, రవాణా శాఖ కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఎన్‌హెచ్–65 రహదారిని 6 వరుసలుగా విస్తరించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ విస్తరణ ప్రాజెక్టులో భాగంగా నల్గొండ జిల్లా పరిధిలోని 62.20 కిలోమీటర్ల నుంచి 126.800 కిమీ వరకు రహదారిని విస్తరించనున్నారు. ఇందుకోసం జాతీయ రహదారుల చట్టం–1956లోని సెక్షన్ 3ఏ(1) కింద కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను సైతం జారీ చేసింది. నేషనల్ హైవే 65 రోడ్డు విస్తరణ పనుల కోసం నల్గొండ జిల్లాలోని చిట్యాల, కట్టంగూర్, నార్కెట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి మండలాల పరిధిలో భూసేకరణ చేయనున్నారు. వీటిలోని వెలిమినేడు, వట్టిమర్తి, చిట్యాల, నార్కెట్‌పల్లి, యల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు, పామనగుండ్ల, దుగ్నేపల్లి, అయిటిపాముల, చందంపల్లి, నకిరేకల్, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాల పరిధిలోని 70 సర్వే నంబర్ల నుంచి మొత్తం 6.32 హెక్టార్ల వ్యవసాయ, వ్యవసాయేతర భూములను ఈ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం సేకరించనుంది. ప్రభుత్వం జారీ చేసిన ఈ భూసేకరణ నోటిఫికేషన్‌పై ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉన్న భూఉజమానులు లేదా సంబంధిత వ్యక్తులు 21 రోజుల్లోగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)కి నివేదించుకోవాలని అందులో సూచించారు. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించిన తరువాత అధికారులు ల్యాండ్ అక్విజిషన్ ప్రాజెక్టుకు సంబంధించిన తుది నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారని తెలుస్తోంది. హైదరాబాద్– విజయవాడ రూట్ 6 లేన్లుగా విస్తరిస్తే ముఖ్యంగా పండుగ సమయాల్లో ఏర్పడే భారీ రద్దీని కొంతమేర నియంత్రించే అవకాశం ఉంటుంది.

## శ్రీవారిసేవలో సీఎం చంద్రబాబు



-మొదటిపేజీ తరువాయి
సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్, చిన్న జీయర్, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, కంకణ బట్టర్ వెంకట రాఘవ దీక్షితులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, భాను ప్రకాశ్‌రెడ్డి, పనబాక లక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మరోవైపు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు కుటుంబసభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు తిరుమలకు తరలివచ్చారు. వారికి శ్రీగాయత్రీ నిలయం వద్ద దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్, ఈవోతో పాటు బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్ల స్వాగతం పలికారు. ఆ తర్వాత బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామిని చంద్రబాబు దర్శించుకున్నారు.

దర్శనానంతరం చంద్రబాబుకు అర్చకస్వాములు పరివట్టం కట్టారు. ఆ తర్వాత పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని శ్రీవారి సన్నిధికి సీఎంతో పాటు కుటుంబసభ్యులు చేరుకున్నారు. మహాద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. బంగారు ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం స్వామి వారికి చంద్రబాబు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. సీఎం హోదాలో 16వ సారి ఆయన తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం రంగనాయకుల మండలంలో చంద్రబాబుకు పండితులు వేద ఆశీర్వచనం అందజేయగా, స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని టీటీడీ ఛైర్మన్, ఈవో అందించారు.

అనంతరం శ్రీదేవీ భూదేవి సమేతుడైన మలయప్పస్వామి తిరువణాభరణాలను ధరించి తొలి వాహనమైన పెద్దశేష వాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. పెద్దశేష వాహనసేవలో సీఎం చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబసభ్యులు పాల్గొన్నారు. టీటీడీ పాలకమండలి, అధికారులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి హిందువు జీవితంలో ఒక్కసారైనా తిరుమలకు రావాలని, శ్రీవారిని దర్శించుకుని, ఆయన వద్ద కొంత సమయం గడపాలన్నారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలను భావితరాలకు అందించే బాధ్యత మనదేనని స్పష్టం చేశారు.

సీఎం చంద్రబాబు ఇవాళ రాత్రి తిరుమలలోని గాయత్రి భవనంలో బస చేయనున్నారు. రేపు (బుధవారం) రెండో రోజు పర్యటనలో భాగంగా తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1 లో నూతనంగా ఏర్పాటు చేసిన పిల్ గ్రిమ్ ఎక్స్ పీరియన్స్ సెంటర్, ఎస్వీ మ్యూజియం, ఎలక్ట్రిక్ బస్సులు, నందకం యాప్, భక్తులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాలను ఆయన ప్రారంభించనున్నారు.

## కోచింగ్ కేంద్రాలు రాజకీయ కుట్రలకు వేదిక కాకూడదు

-మొదటిపేజీ తరువాయి
ఏమాత్రం సమర్థనీయం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలి**

ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణా నిబంధనలు--2026 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా జీవో నెంబరు 9లోని నిబంధనలకు అనుగుణంగానే సంస్థల నిర్వహణ ఉండాలన్నారు. మార్గదర్శకాలను ఉల్లంఘించినట్టు తేలితే సంబంధిత కోచింగ్ సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు.

నిబంధనల అమలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా జరగాలని సీఎం ఆదేశించారు. ప్రైవేటు కోచింగ్ కేంద్రాల కార్యకలాపాలను అధికారులు పరిశీలిస్తూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుస్తున్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు నిబంధనల ఉల్లంఘన, అభ్యర్థులపై అనుచిత ఒత్తిడి వంటి అంశాలు బయటపడితే తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకావద్దని ప్రభుత్వం సూచించింది. తమ కెరీర్, పరీక్షల సన్నద్ధతపైనే పూర్తి దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. కోచింగ్ సంస్థల నుంచి ఏదైనా ఒత్తిడి, ఇబ్బంది లేదా అనుచిత ప్రేరేపణ ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించింది. కోచింగ్ కేంద్రాల ప్రధాన ఉద్దేశం పోటీ పరీక్షలకు అభ్యర్థులను సమర్థవంతంగా సిద్ధం చేయడమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ లక్ష్యాన్ని పక్కనబెట్టి సంస్థల యజమానులు తమ వ్యక్తిగత లేదా ఇతర ప్రయోజనాల కోసం అభ్యర్థులను వినియోగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించింది. రాజకీయ కుట్రలు, ఆందోళనలు, నిరసనలకు విద్యార్థులను వాడుకునే ప్రయత్నాలపై చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేసింది.

## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత



మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) (57) కన్నుమూశారు. విశాఖలో మంగళవారం గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఏలూరు నుంచి మూడు సార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. 2004, 2009లో కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. 2017లో ఎమ్మెల్సీగా పని చేశారు. ఆ తర్వాత వైఎస్సార్సీపీలో చేరి 2019లో ఆ పార్టీ తరఫున గెలిచారు. జగన్ హయాంలో డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2025లో ఆళ్ల నాని టీడీపీలో చేరారు.

సంతాపం: మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్?, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 56 సంవత్సరాల వయసులోనే గుండెపోటుతో ఆయన దూరమవ్వడం బాధాకరమని చంద్రబాబు అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఆళ్ల నాని ఆత్మకు శాంతిని చేకూర్చాలని చంద్రబాబు ఆకాంక్షించారు. వివాదాలకు దూరంగా, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలిగే నాని స్మృతిలో లోకేశ్? నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ పల్లా శ్రీనివాసరావు నివాళులర్పించారు. నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.

ఆళ్ల నాని మృతి పట్ల కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.

# ప్రజా సమస్యల పై మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతులు.

- ప్రజల సమస్యలు ఓపికగా విన్న మంత్రి సత్యకుమార్ యాదవ్.
- రెవెన్యూ, విద్యుత్, నీటి సమస్యల పై మంత్రిని కలిసిన నియోజకవర్గ ప్రజలు.
- పింఛన్లు, సీఎంఆర్ఎఫ్, చేనేత సమస్యల పై మంత్రి కి ప్రజల వినతులు.
- ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందాలి.
- ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటాం మంత్రి.
- ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది మంత్రి.





**ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** ధర్మవరం పట్టణం లోని ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ప్రజలు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ని కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గం లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను మంత్రి సత్యకుమార్ యాదవ్, స్వయంగా కలుసుకుని వారి సమస్యలను ఓర్పుగా విని, వాటి పరిష్కారానికి అవసర మైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు, పట్టణం, గ్రామాల్లో విద్యుత్ సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, సాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అదే విధంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందించాలని మంత్రిని కలిసి దరఖాస్తులు సమర్పించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గేలా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. చేనేత కార్మికులు కూడా మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద నూతనంగా అందిస్తున్న చేనేత పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు, అర్హతలు, పింఛన్ మంజూరు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మగ్గం నడుపుతూ జీవనం సాగిస్తున్న అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు తదితర వివిధ సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి కూడా పలువురు తమ సమస్యలను మంత్రికి వివరించి వినతిపత్రాలు సమర్పించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం.



- ఎమ్మెల్యేలు, అధికారులతో జిల్లా ఇన్చార్జి మంత్రి డీబీవీ స్వామి, ఎంపీ శ్రీభరత్.
- ఏర్పాట్ల పై కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో పలు అంశాల పై చర్చ.

**విశాఖపట్టణం, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** ఈ నెల 19 వ తేదీన విశాఖపట్టణం వేదికగా జరిగే పలు కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా ఇన్ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, స్థానిక ఎంపీ శ్రీ భరత్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో వర్చ్యువల్ గా పాల్గొన్న వారిద్దరూ అధికారులకు, ఎమ్మెల్యేలకు పలు అంశాల పై దిశానిర్దేశం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పట్టాల పంపిణీ కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని, అర్హులైన వారందరికీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలు అందజేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల నుంచి ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారో తెలుసుకొని వారికి ముందుగానే ఆహ్వాన పత్రాలు అందజేయాలన్నారు. ఆ సమయం లోనే వారు వేదిక వద్దకు ఎలా చేరుకోవాలి, వారికి ఏ గ్యాలరీ కేటాయించామో తెలియజేయాలని చెప్పారు. నిర్ణీత సమయానికి అందరూ చేరుకునేలా ప్రతి ఒక్కరికీ ఆహ్లాదకర వాతావరణంలో పట్టాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. 26,426 మందికి ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడ్స్ అందజేత జిల్లా కలెక్టర్. విశాఖపట్నం జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడ్స్ పంపిణీకి సంబంధించి మొత్తం 26,426 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. జిల్లా లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పంపిణీకి సంబంధించిన లైన్ లిస్టింగ్‌ను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా భీమిలి 4,198, గాజువాక 5,597, పెందుర్తి 2,896, విశాఖ తూర్పు 5,107, విశాఖ ఉత్తరం 2,425, విశాఖ దక్షిణం 1,228, విశాఖ పశ్చిమం 4,975 మంది లబ్ధిదారులు ఉన్నట్లు వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే కార్యక్రమంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ఇళ్ల స్థలం, సంబంధిత హక్కు పత్రాలు అందేలా యంత్రాంగం తరఫున చర్యలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్కే బీచ్ పరిసరాల్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం.

అలాగే అదే రోజు బీచ్ రోడ్లో సాగర స్వచ్ఛత పేరుతో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుగుతుందని, దానిలో భాగంగా ఇన్క్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిర్మల్ సాగర్ పైలెట్ ప్రాజెక్టును కూడా ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిర్మల్ సాగర్ కార్యక్రమంలో భాగంగా బీచ్ క్లీనింగ్, సముద్ర వ్యర్థాల రీసైక్లింగ్, ఉపాధి కల్పన తదితర కార్యాచరణ మార్గాలు ఉంటాయన్నారు. దీనిలో కేంద్ర కార్యదర్శితో పాటు, యూఎన్డీపీ ప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారని వివరించారు. అయితే సాసా కార్యక్రమం వేదిక ఇంకా ఫైనల్ కాలేదని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. బీచ్ రోడ్ తో పాటు, గాజువాకలో ఆర్.డబ్ల్యు.ఎస్. ఆధ్వర్యంలో కొనసాగుతున్న టెర్రాస్ కల్చర్, వాన నీటి నిర్వహణ, నరవలోని మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ నిర్వహణ తదితర అంశాలు పరిశీలనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్యారోగ్య సేవా ట్రస్ట్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ జి. విద్యాధరి, డీసీపీ మేరీ ప్రశాంతి, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నగర తాగునీరు, మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణ కోసం కీలక అడుగులు.

- రూ.107.71 కోట్ల విలువైన అమృత్ 2.0 అభివృద్ధి పనులు ప్రారంభం.
- పనులు ప్రారంభించిన జిల్లా ఇన్ ఛార్జి మంత్రి టీజీ భరత్.
- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమం.







**అనంతపురం, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** అనంతపురం నగర తాగు నీరు, మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణ కోసం కీలక అడుగులు పడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్ ఛార్జి మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ లతో కలసి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు. పాతవూరు లోగల లక్ష్మీ చెన్నకేశవ స్వామి గుడి ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ కాంపౌండ్ లో కార్యక్రమం.

నగరంలో తాగునీటి సరఫరాలో ఉన్న అంతరాలను పూర్తిగా తొలగించేలా పనులు. ప్రతి ఇంటికీ సమర్థవంతంగా నీటిని అందించే లక్ష్యంతో 37.39 కోట్ల రూపాయలతో ఆల్వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్. నీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు 5.47 కిలో మీటర్ల మేర గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్‌ను ఏర్పాటు. నగరం లోని అన్ని ప్రాంతాలకు తాగునీరు చేరేలా 12.27 కిలో మీటర్లతో కొత్త డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్. నీటి కొరత రాకుండా ఉండేందుకు ఆరు కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్ ల నిర్మాణం. మొత్తం 5,200 కిలో లీటర్ల సామర్థ్యం గల అదనపు నీటి నిల్వను అందుబాటు లోకి రానున్నాయి. నగరం లోని మారుతి నగర్, సంగమేశ్ నగర్, ఆదర్శ నగర్, గాంధీ పార్క్, జనశక్తి నగర్ లలో కొత్త వాటర్ ట్యాంక్ లు ఏర్పాటు. నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు 70.32 కోట్ల రూపాయలతో అమృత్ 2.0 సీవరేజ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ స్కీమ్ పనులకు శ్రీకారం చుట్టారు. నగర మురుగునీటిని శుద్ధి చేసేందుకు అత్యాధునిక సాంకేతికతతో 25 ఎంఎల్డి సామర్థ్యంతో కలిగిన భారీ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం చేయనున్నారు. మురుగునీటి తరలింపు కోసం 5.47 కిలో మీటర్ల పొడవైన సీవర్ ట్రంక్ మెయిన్ నిర్మాణం. ప్లాంట్ నిరంతర నిర్వహణ కోసం 250 కేవిఎ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు. తాగునీరు, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో పనులు ప్రారంబించారు.

# ఆళ్ల నాని మృతి పై విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ దిగ్భ్రాంతి.

- ఆళ్ల నాని మరణం కలచివేసిందన్న ఎమ్మెల్యే యార్లగడ్డ.
- ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన యార్లగడ్డ.



**గన్నవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నాయకుడు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) ఆకస్మిక మరణం పై ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన గుండెపోటుతో కన్నుమూయడం తనను ఎంతగానో కలచివేసిందని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గన్నవరం నియోజకవర్గంతో ఆళ్ల నానికి ఉన్న అనుబంధం, వ్యక్తిగతంగా తన పై ఆయన చూపించిన ఆప్యాయతానురాగాలు ఎప్పటికీ మరువలేనివని యార్లగడ్డ గుర్తు చేసుకున్నారు. పదవుల్లో ఉన్నా లేకపోయినా అందరితో ఎంతో సౌమ్యంగా, ఆత్మీయంగా మెలిగే స్వభావం ఆళ్ల నాని సొంతమని కొనియాడారు. ఒక మంచి మనసున్న ప్రజా నాయకుడితో పాటు, ఆత్మీయుడిని కోల్పోవడం పూడ్చలేని లోటని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించిన యార్లగడ్డ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ ఘన నివాళులు అర్పించారు.

# అర్బన్ టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన ఇన్ ఛార్జి మంత్రి టీజీ భరత్.

- ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి నాయకులు.
- స్థానిక ఎన్నికల పై దిశానిర్దేశం చేసిన మంత్రి టీజీ భరత్.





**ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచే విధంగా పని చేయాలని ఇన్ ఛార్జి మంత్రి టీజీ భరత్ గారు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి టి.జి. భరత్ విచ్చేసారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు తో కలిసి నూతన కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి తో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో టీజీ భరత్ సమావేశమయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత పై నాయకులతో చర్చించారు. ఎన్నికల్లో గెలుపే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు సమన్వయంతో, అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, స్థానిక సంస్థల్లో టీడీపీ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు, వివిధ విభాగాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నక్కపల్లి సిఐ జె. మురళి తెలిపారు. నక్కపల్లి సిఐ జె.మురళి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.నక్కపల్లి మండలం,దేవవరం పంచాయతీ పరిధిలోని వడ్డిమెట్ట గ్రామంలో వినాయక చవితి సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో దేవవరం గ్రామానికి చెందిన గింజాల రమణ, ప్రసాదుల శివాజీ అనే ఇద్దరు వ్యక్తులు మధ్య మధ్యలో ఘర్షణ పడుతుండగా అక్కడ విధుల్లో ఉన్న నక్కపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సన్నిబాబు సిబ్బంది వారిని కంట్రోల్ చేస్తుండగా సదరు వ్యక్తులు పోలీసు వారితో ఘర్షణ పడి , పోలీసు వారి విధులకు ఆటంకం కలిగించారన్నారు.

ఈ ఘటనపై నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సి ఐ మురళి తెలిపారు.

## పాఠశాలల విద్యాకమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- పాఠశాలల్లో ప్రారంభమైన ఎన్నికల సందడి




**నక్కపల్లి, పెన్ సత్తా,సెప్టెంబరు 15:** ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జరీ చేసింది. దీనిలో భాగంగా దేవవరం హైస్కూల్లో మంగళవారం పాఠశాల ఎస్.ఎమ్.సీ. ఎన్నికల నిర్వాహణ ప్రక్రియలో భాగంగా గజిటెడ్ హెచ్.ఎమ్. వేమగిరి నూకరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎన్నికల నోటిఫికేషన్ ను పాఠశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. ఈనెల 15 న నోటిఫికేషన్ తో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనదని,18 న ఓటర్ల జాబితా ప్రదర్శన,అభ్యంతరాలు స్వీకరణ అనంతరం ఈనెల 25 న తుది ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచఢం జరుగుతుంది.ఈనెల 29 న పాఠశాల చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక నిబంధనలమేరకు నిర్వహించడం జరుగుతుందని నోటిఫికేషన్ లో పేర్కొన్నారు. అదే రోజు సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుంది.ఇదే విషయమై స్ధానికమండల విద్యాశాఖాధికారి కే.నరేష్ ను సంప్రదించగా నిబంధనలమేరకు మండలంలో అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాధమిక పాఠశాలల్లో మంగళవారం పాఠశాలల నోటీస్ బోర్డులపై నోటిఫికేషన్ ప్రదర్శన చేశామన్నారు ఈ సందర్భంగా నరేష్ విలేఖరులతో మాట్లాడుతూ 100 మంది పిల్లలు లోపు ఉంటే 12 నుండి 15 మంది సభ్యులు,అదేవిధంగా 100 నుండి 500 మంది ఉంటే 15 నుండి 20 మంది,సభ్యులు, 500 పైన విద్యార్ధులున్న పాఠశాలల్లో 20 నుండి 25 మంది సభ్యులును ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. 50శాతం మహిళలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికైన సభ్యుల పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుందనిఅయన అన్నారు.చినదొడ్డిగల్లు హైస్కూల్ లో హెచ్.ఎమ్. వి.బాలాజీ,ఉద్దండపురం ఆర్.నాగన్నదొర, పెదబోదుగల్లం ఎస్.జయశ్రీ, స్ధానిక బాలికల ఉన్నత పాఠశాలలో వి.శ్రీలక్ష్మి, పి.విజయ,గొడిచర్ల లో సత్యకుమార్, జానకయ్యపేట లో బషీర్ ఖాన్, డి.ఎల్ పురం లో సంధ్యారాణి, కే జీ.బీ.వీ పాఠశాలలో సలీమా , రాజయ్యపేట లో శ్రీలక్ష్మీ, రమణయ్యపేటలో చినతల్లి వేంపాడులో హెచ్.ఎమ్ యు.వరలక్ష్మి తదితరులు ఎన్నికల నోటిఫికేషన్ నోటీస్ బోర్డ్ లో అంటించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా టిడిపి - కొప్పిశెట్టి వెంకటేష్



**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** కార్యకర్తల కుటుంబాలకు అండగా టిడిపి ఉంటుందని పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మంగళవారం నక్కపల్లి మండలం గొడిచెర్లలో అల్లు బాబురావు బస్సు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఆయనకు టీడీపీ సభ్యత్వం ఉన్నందున రూ.5 లక్షల చెక్కును వారి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు ఐదు లక్షల ప్రమాద భీమా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, మత్స్యకారుల జిల్లా సంఘం ప్రెసిడెంట్ గోసాల తాతారావు, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, ఆధ్వర్యంలో చెక్కు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గోడిచెర్ల పార్టీ ప్రెసిడెంట్ నల్లల నారాయణరావు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వారా గాంధీ, బొండాడ రవిశంకర్, కొల్లు అప్పలకొండ, మొలల్లి నాగరాజు, కక్కల అప్పారావు, ఉప్పాటి బాబ్జి తదితరులు ఉన్నారు.

## దేవవరం జంక్షన్‌లో 110 మద్యం బాటిళ్లు స్వాధీనం- నిందితుడు రిమాండ్



**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** నక్కపల్లి మండలం దేవవరం జంక్షన్ లో ఉన్న పాన్ షాప్ లో 110 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు నక్కపల్లి ఎస్సై సన్నిబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానికులు మాట్లాడుతూ నక్కపల్లి సీఐ జె.మురళి ఇచ్చిన ఖచ్చితమైన సమాచారం మేరకు,తమ సిబ్బందితో కలిసి దేవవరం జంక్షన్‌లోని పాన్ షాప్ వద్ద తనిఖీ నిర్వహించగా దేవవరం గ్రామానికి చెందిన బొట్టా రాము తండ్రి ఎర్ర అబ్బాయి పాన్ షాప్ లో తనిఖీ చేయగా 110 మద్యం బాటిల్ లో పట్టు పడ్డాయి అన్నారు.ఈ ఘటనపై సి ఐ మురళి కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్ నిమిత్తం ఎలమంచిలి కోర్టులో హాజరుపరచడ మైనదని ఆయన తెలిపారు.

## పక్కా ప్రణాళిక.. సరైన వ్యూహం తోనే జిల్లాకు ఉజ్వల భవిష్యత్తు






- దిశా సమావేశంలో పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్.
- అజెండా అంశాలను వివరించటంతో పాటు, అధికారులకు దిశానిర్దేశం.
- జిల్లా అధికారులతో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పై సమీక్ష సమావేశం.
- పలు ప్రజా సమస్యల పై సూచనలు చేసిన ఎమ్మెల్యేలు.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** పక్కా ప్రణాళిక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధి లోని అధికార యంత్రాంగం సమష్టి కృషి, సమన్వయంతో, సరైన వ్యూహం తోనే అనకాపల్లి జిల్లాకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ అధ్యక్షతన మండల, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన త్రైమాసిక సమీక్ష సమావేశంలో మౌలిక వసతులు, వివిధ అభివృద్ధి పనుల పై కీలక చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ముఖ్యంగా రైల్వే, జాతీయ రహదారులకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. రైల్వే పరిధిలో కొత్తగా మంజూరైన పనులు, టెండర్ దశలో ఉన్న ప్రాజెక్టులు, స్టేషన్ల ఆధునీకరణ (మాడర్నైజేషన్), ఎలివేటర్లు, లిఫ్టులు, ఆర్ఓబీ, ఆర్‌యుబీ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతి పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టెండర్లు ఖరారైనప్పటికీ చిన్న చిన్న సమస్యల వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. తాగునీరు, విద్యుత్, టెలిఫోన్ కేబుళ్లు, వాటర్ వర్క్స్ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న లక్ష్మీదేవిపేట ప్రాజెక్ట్‌కి సంబంధించి రైల్వే శాఖ చేయాల్సిన పనులను పూర్తి చేసిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు 97-98 కోట్లను రైల్వే శాఖ వెచ్చిస్తోందని, దీనికి సంబంధించి 30 రోజుల వ్యవధితో టెండర్ నోటిఫికేషన్ విడుదలైనట్లు వెల్లడించారు. ఏజెన్సీల ఎంపికను త్వరలోనే పూర్తి చేసి, రాబోయే దసరా లేదా దీపావళి నాటికి పనులను ప్రత్యక్షంగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డీఓ, ఎంఆర్‌ఓ, ఇతర సంబంధిత అధికారులను ఆదేశించారు.

జాతీయ రహదారులు, బిఎస్ఎన్ఎల్, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పి ఎం ఈ జి పి), జల జీవన్ మిషన్, అమృత్, వికసిత్ భారత్ -- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) పథకం, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, పిఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకం,(సెంట్రల్ రోడ్ ఫండ్), (ప్రస్తుతం సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్), ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల పై చర్చించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ

అనకాపల్లి జిల్లా నుండి ప్రత్యేక రైళ్లు మంజూరు చేసినందుకు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ ని ప్రత్యేకంగా అభినందించారు. అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నందున, విశాఖ నుంచి బయలుదేరే వందే భారత్ అనకాపల్లి జిల్లాలో హాల్ట్ ఉండే విధంగా ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ ఏర్పాటు, బొజ్జన్న కొండ అభివృద్ధి తదితర అంశాల పై పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ ను కోరారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ

గడువు లోగా లక్ష్యాలను సాధించాలని అధికారులకు ఆదేసించారు. జిల్లా సమీక్షా సమావేశంలో భాగంగా నిర్వహించిన దిశా కమిటీ సమావేశం అత్యంత ఫలప్రదంగా ముగిసిందని, ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు అందించిన విలువైన సూచనలు, సలహాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నేటి సమావేశంలో నిర్ణయించిన అన్ని అభివృద్ధి లక్ష్యాలను తదుపరి దిశ కమిటీ సమావేశం నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) తమ పరిధిలోని సమస్యల పై ఇచ్చిన సలహాలను ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల పై అధికారులు వివరిస్తూ

కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గడిచిన సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలకు (ఎస్.హెచ్.జి) 5.57 కోట్లు (5,05,70,000) సిఐఎఫ్ రివాల్వింగ్ ఫండ్‌గా అందించడం జరిగింది. మహిళలు తమ జీవనోపాధిని పెంపొందించుకోవడానికి ఈ రుణాలను వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం కింద 2025-26 సంవత్సరానికి 14.11 కోట్లు, అలాగే 2026-27 సంవత్సరానికి 1.05 కోట్లు విడుదలయ్యాయని వివరించారు. లఖ్‌పతీ దీదీ పథకం కింద గత సంవత్సరం సుమారు 68,600 మంది మహిళలను 'లఖ్‌పతీ దీదీ'లుగా తీర్చిదిద్ది రాష్ట్రం లోనే ప్రథమ స్థానంలో నిలవడం జరిగిందని, కేంద్రం నుండి వచ్చే పిఎంఈజిపి, పిఎంఎఫ్‌ఎంఈ నిధులతో పాటు స్త్రీ నిధి, ఉన్నతి వంటి బ్యాంక్ లింకేజీలను సమన్వయం చేసుకొని మహిళలు సొంత వ్యాపారాలను ఏర్పాటు చేసుకుంటున్నారని పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ కు విన్నవించారు. ఈ సంవత్సరం మరో 74,036 మంది మహిళలను లఖ్‌పతీ దీదీలుగా మార్చేందుకు విస్తృతంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. పిఎంఈజిపి, పిఎంఎఫ్‌ఎంఈ పథకాల ద్వారా గత ఏడాది ఇచ్చిన టార్గెట్‌ను 100% విజయవంతంగా సాధించినట్లు అధికారులు తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, అల్లూరి జిల్లా ఐటీడీఏ, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదిత్య వర్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఇల్లు పట్టాలు.. ఇంటింటికీ తాగునీరు అనిత.





- పాయకరావుపేట సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
- ఇల్లు ఉండి పట్టాలు లేని అర్హులకు త్వరలో పట్టాలు.
- జల జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు.
- అధికారుల విధుల్లో అలసత్వాన్ని ఉపేక్షించేది లేదు హోం మంత్రి అనిత.

**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో ఇల్లు ఉండి పట్టాలు లేని, అర్హులకు త్వరలోనే ఇళ్ల పట్టాలు అందించే చర్యలు చేపడతామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అలాగే జల జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి పై వివిధ శాఖల అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం లోని నాలుగు మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఎలక్ట్రికల్, పీఆర్ ప్రాజెక్ట్స్, ఎండోమెంట్, పీఆర్ ఇంజినీరింగ్ తదితర శాఖల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు అవసర మైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

పాయకరావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అనిత అన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పోలవరం జలాలతో కొత్త అభివృద్ధి.**

పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లి జిల్లాకు తీసుకురావడం ఎంతో సంతోషకర మైన విషయమని మంత్రి అన్నారు. పాయకరావుపేట ప్రాంతంలో పోలవరం కాలువ పరిసరాలను భవిష్యత్తులో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పై సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు, వివిధ వసతులు కల్పిస్తోందని చెప్పారు. గ్రామ స్థాయిలో ట్రాఫిక్ నిబంధనల పై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హోం మంత్రి సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారి పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు.

**నక్కపల్లి బాయ్స్ హైస్కూల్ మోడల్ స్కూల్ గా.**

నక్కపల్లి బాయ్స్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హోం మంత్రి అనిత తెలిపారు. నియోజకవర్గంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఇంజినీర్స్ డే సందర్భంగా ఇంజినీర్లకు హోం మంత్రి అనిత శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ ఇంజినీరింగ్ రంగానికి విశేష సేవలు అందించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్ల సేవలను స్మరించుకోవాలని అన్నారు. దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని, అభివృద్ధి పనుల్లో వారి నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పాయకరావు పేట నియోజకవర్గ అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హోం మంత్రి అనిత సూచించారు.

# ఎన్బీఏ గుర్తింపు సాధించిన పాలిటెక్నిక్ ను సందర్శించిన మంత్రి సత్యకుమార్.





- పాలిటెక్నిక్ ను సందర్శించి విద్యార్థులను అభినందించిన మంత్రి.
- ఆధునిక సాంకేతిక విద్యతో విద్యార్థులు దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి.
- విద్యార్థులు ఉద్యోగాలు పొందడమే కాదు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి.
- ప్రతిభకు అవకాశాలు కల్పిస్తాం లక్ష్యాన్ని సాధించే వరకు విద్యార్థులకు అండగా ఉంటాం.

**ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:** ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లోని అన్ని కోర్సులకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్బీఏ) గుర్తింపు 2029 డిసెంబర్ 31 వరకు పొడిగించబడిన సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ మంగళవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్బీఏ గుర్తింపు సాధించడంలో కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను మంత్రి అభినందించారు. కళాశాల లోని విద్యా వాతావరణం, విద్యార్థులకు అందుతున్న సాంకేతిక శిక్షణ, ప్రయోగశాలలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. విద్యార్థులు కేవలం డిప్లొమా, డిగ్రీలు సాధించడం లేదా ఒక ఉద్యోగం పొందడం మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు, తమ తల్లిదండ్రులను గర్వపడేలా చూసుకోవాలని, సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా గౌరవప్రదమైన స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ దేశపు యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి. మీరు సంపాదించే జ్ఞానం, నైపుణ్యాలు మీ జీవితానికే కాకుండా మరొకరికి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లాలి అని మంత్రి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని, దేశ ప్రగతిలో ధర్మవరం విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఇప్పటి నుంచే నిర్దేశించు కోవాలని మంత్రి సూచించారు. ధర్మవరం లోని సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసర మైన కోచింగ్‌ను ఉచితంగా అందించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకుండా ప్రతిభ ఉన్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కళాశాలలో విద్యార్థులకు మరింత మెరుగైన సాంకేతిక విద్య, ప్రాక్టికల్ నైపుణ్యాలు అందించేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక విద్యా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విద్యార్థుల్లో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సిద్ధం చేయడమే లక్ష్యమన్నారు. ఎన్బీఏ గుర్తింపు రావడం కళాశాలకు మాత్రమే కాకుండా ధర్మవరం ప్రాంత విద్యార్థులకు కూడా గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కళాశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్‌ను మరింత అభివృద్ధి చేయడం, కంప్యూటర్ ల్యాబ్‌లో నాలుగు ఏసీలు ఏర్పాటు చేయడం, కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి అవసరాలను వివరించారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం, సాంకేతిక సదుపాయాలు కల్పించేందుకు వీటిపై సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అదేవిధంగా ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంవత్సరానికి సుమారు ఏడు నుంచి ఎనిమిది సార్లు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సిబ్బంది మంత్రికి వివరించారు. ఈ జాబ్ మేళాలకు వివిధ ప్రముఖ కంపెనీలు హాజరవుతున్న నేపథ్యంలో, ఆయా సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధుల ద్వారా కళాశాలకు అవసర మైన మౌలిక వసతులు, సాంకేతిక పరికరాలు సమకూర్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, మంత్రి చొరవ తీసుకుని సంబంధిత కంపెనీలతో సమన్వయం చేసి సీఎస్సార్ నిధులు కళాశాలకు అందేలా సహకరించాలని కోరారు. కళాశాల సిబ్బంది విజ్ఞప్తి పై మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే మౌలిక వసతులు, సాంకేతిక సదుపాయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జాబ్ మేళాల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, వాటి ద్వారా కంపెనీలతో కళాశాలకు ఏర్పడుతున్న అనుసంధానాన్ని ఉపయోగించుకుని సీఎస్సార్ సహకారాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు లభించిన ఎన్బీఏ గుర్తింపు విద్యా నాణ్యతకు లభించిన ప్రతిష్టాత్మక గుర్తింపుగా అభివర్ణించిన మంత్రి, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం కలిగిన యువతే అభివృద్ధి చెందిన భారతదేశానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా కళాశాలలో మంత్రి సత్యకుమార్ యాదవ్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి ఇంజనీర్స్ డే వేడుకలు జరుపుకొని ఆయన్ను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు, శాకాధిపతులు బాలస్వామి, హరిబాబు, సీనియర్ అధ్యాపకులు కళ్యాణి బాలజ్యోతి, తదితర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఈగల్ టీం ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన






**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 15**: మండలంలో చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "డ్రగ్స్ వద్దు బ్రో" అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఐ.జి.పి. ఆకే రవి కృష్ణ, ఐ పి ఎస్ జిల్లా ఎస్ పీ తుహిన్ సిన్హా, అనకాపల్లి జిల్లా వారి ఆదేశాల మేరకు, డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమాన్ని ఈగల్ సెల్ అనకాపల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి కారణంగా శారీరక, మానసిక ఆరోగ్యంపై కలిగే ప్రతికూల ప్రభావాలు నేరచరిత్రపై పడే ప్రభావాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబం, విద్యార్థుల భవిష్యత్తు, సమాజంపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అలాగే, ఎన్ డి పి ఎస్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం వంటి కార్యకలాపాలకు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలను వివరించారు.

గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని, సమాచారమిచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు.యువతకు సైబర్ క్రైమ్‌పై కూడా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి, "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదం చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి.బాలాజీ, ఈగల్ సిబ్బంది, నక్కపల్లి పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏ ఎం ఎన్ ఎస్ గ్రీన్ ఫీల్డ్ క్యాప్టివ్ పోర్ట్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 15:**నక్కపల్లి మండలం డిఎల్ పురం వద్ద అక్టోబర్ 15 వ తేదీన చట్ట విరుద్ధం గా ఏ ఎం ఎన్ ఎస్ నిర్వహించే గ్రీన్ ఫీల్డ్ క్యాప్టివ్ పోర్టు ప్రజాభిప్రాయ సేకరణ వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించకుండా, భూ యజమానులు, మత్స్యకారుల,ఇతర గ్రామ ప్రజలు యొక్క ఆమోదం లేకుండా చట్టవిరుద్ధంగా ఎలా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని ప్రశ్నించారు.ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు రూపొందించిన సామాజిక ప్రభావ అంచనా నివేదిక అంతా అవాస్తవాలు తో కూడి ఉన్నదని తెలిపారు.రూ.8,174.39 కోట్లు పెట్టుబడి తో ఏడు బెర్తులు గల గ్రీన్ ఫీల్డ్ క్యాప్టివ్ పోర్ట్ 2.9 కిలోమీటర్లు పరిధిలో నిర్మిస్తామని ప్రకటించారు,ఈ నివేదిక లో ప్రత్యేకంగా, పరోక్షంగా ఎంత మంది కి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తారో కనీసం ప్రస్తావన చేయలేదని తెలిపారు. పోర్టు చుట్టూ పది కిలోమీటర్లు ప్రాంతంలో పోర్టు కార్యకలాపాలు ప్రభావం కల్పిస్తాయని ప్రకటించారు.అంటే రాజయ్య పేట,బోయపాడు, అమలాపురం,డిఎల్ పురం,బంగార్మపేట,పెంటకోట సుమారు 15 వేలు మంది మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతారని, అమలాపురం,నెల్లిపూడి,డిఎల్ పురం ,గునుపూడి భూ యజమానులు, కూలీలు పది వేల మంది ఉపాధి కోల్పోతారని ఇరవై ఐదు వేల మంది ని జల సమాధి చేసి ప్రపంచంలో స్టీల్ ఉత్పత్తి చేసే దిగ్గజ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం గ్రీన్ ఫీల్డ్ క్యాప్టీవ్ పోర్ట్ ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు.డిఎల్ పురం సర్వే నెంబర్లు,82,85,235 భూములలో సాగులో ఉన్న పేదలకు నేటి కి నష్టపరిహారం చెల్లించలేదని,గునుపూడి గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 202 లో సుమారు నలభై మంది కి నలభై ఎకరాలు ఢీ ఫారం భూములు దళితులు, మత్స్యకారుల, యాదవులు,కల్లుగీత కార్మికులుకు 1966 లో ఆనాటి ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం సాగు దార్లు కు ఏ మాత్రం తెలియజేయకుండా, నష్టపరిహారం చెల్లించకుండా ఆ భూములలో చట్టాలను ఉల్లంఘించి పోర్టు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.

వెంటనే స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఏర్పాటు చేసే గ్రీన్ ఫీల్డ్ క్యాప్టీవ్ పోర్ట్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎం.మహేష్ బాబు, నాయకులు కె.దేముడు,ఎం.నరేష్,పి.రాజు,పి.బంగారయ్య,కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 21న శాప్ కార్యాలయం ఎదుట వైయస్ఆర్‌సీపీ నిరసన




**తాడేపల్లి:** మెగా డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా నియామకాల్లో జరిగిన అవకతకలపై తక్షణం సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న వైయస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో విజయవాడ శాప్ కార్యాలయం ముందు నిరసన చేపట్టనున్నట్టు మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. స్పోర్ట్స్ కోటాలో తప్పుడు సర్టిఫికెట్లతో అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టారని వైయస్ఆర్‌సీపీ మొదటి నుంచీ ప్రశ్నిస్తోందన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కకుండా అన్యాయం చేసి, అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టారని విమర్శించారు. చివరకు ప్రభుత్వ శాఖల్లోనే కొన్ని స్పోర్ట్స్ సర్టిఫికెట్లు తప్పుడువని తేలుతున్న పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు సైతం తమకు ఉద్యోగం ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదని చెప్పే పరిస్థితి వచ్చిందంటే.. ఈ నియామక ప్రక్రియ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. అక్రమ నియామకాలను చూస్తూ వైయస్ఆర్‌సీపీ ఊరుకోదని, నిరుద్యోగులకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించే వరకు వైయస్ఆర్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

**సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారు?**

నియామక ప్రక్రియలో రోజుకొక అక్రమం బయటకు వస్తోన్నా, అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు న్యాయవిచారణ జరపడం లేదని అంబటి రాంబాబు ప్రశ్నించారు. వైయస్ఆర్‌సీపీ అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అధికారుల చేత మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డీఎస్సీ నియామకాలు పారదర్శకంగా జరిగాయని తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేష్ చెబుతున్నారని, తప్పు జరగలేదని భావించినప్పుడు న్యాయవిచారణ జరిపించి నిజాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ఏమీ తప్పు జరగలేదని భావిస్తున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు.

**నిరుద్యోగులకు అన్యాయం జరిగితే వైయస్ఆర్‌సీపీ చూస్తూ ఊరుకోదు:**

అర్హత ఉన్నవారికి ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి.. తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చుకునే కార్యక్రమం జరిగిందని ఆరోపించారు. అహర్నిశలు కష్టపడి చదువుకుని, ఉద్యోగం వస్తుందనే ఆశతో పరీక్షలకు హాజరైన నిరుద్యోగులకు ఈ విధంగా అన్యాయం చేయడం దారుణమని అంబటి రాంబాబు అన్నారు. డీఎస్సీ గురించి ప్రశ్నిస్తే ఏపీపీఎస్సీలో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపిస్తోందని.. అలాంటప్పుడు రెండింటిపైనా సీబీఐ విచారణ చేయించాలని వైయస్ఆర్‌సీపీ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోందన్నారు. ఆరోపణలు చేయడం కాదు.. దమ్ముంటే సీబీఐ విచారణకు సిద్ధపడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్యాయానికి గురైన అర్హులైన అభ్యర్థులకు తిరిగి ఉద్యోగాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని అంబటి రాంబాబు హెచ్చరించారు.

# యూపీఐపై వడ్డన!




**హైదరాబాద్:** దేశంలో దాదాపు ఆరేళ్లుగా కొనసాగుతున్న పూర్తి ఉచిత యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) చెల్లింపుల సేవలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. యూపీఐ చెల్లింపులపై చార్జీల విధానాన్ని పునఃప్రవేశపెట్టాలంటూ గూగుల్ పే, అమెజాన్ పే, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, జియో పేమెంట్స్ బ్యాంక్ సహా మరికొన్ని సంస్థలు సభ్యులుగా ఉన్న పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెచ్చిన ఒత్తిడితోపాటు ఏటా రూ. 40 లక్షలకుపైగా టర్నోవర్ ఉండే వ్యాపారులపై చార్జీలు విధించాలన్న ఆర్బీఐ, బ్యాంకుల సూచనను పరిగణనలోకి తీసుకుంది. వ్యక్తుల నుంచి వ్యాపారులకు రూ. 2 వేలకుపైగా జరిగే యూపీఐ చెల్లింపుల లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. అలాగే రూ. 75 వేలకన్నా ఎక్కువ విలువైన యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్‌ను గరిష్టంగా రూ. 300గా ఖరారు చేసినట్లు తెలిపింది. అయితే రూ. 2 వేలలోపు వ్యక్తుల నుంచి వ్యాపారులకు జరిపే యూపీఐ చెల్లింపులతోపాటు వ్యక్తుల నుంచి వ్యక్తుల మధ్య జరిగే యూపీఏ లావాదేవీలు, చిరు వ్యాపారులకు ఎలాంటి ఎండీఆర్ చార్జీ వర్తించదని స్పష్టం చేసింది. అక్టోబర్ 15 నుంచి నూతన విధానం అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ, భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ) సంయుక్తంగా నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఎండీఆర్ రుసుము రూపంలో ఏటా పేమెంట్స్ పరిశ్రమకు రూ. 16,000 కోట్లు వస్తాయని అంచనా.

**వినియోగదారులు చార్జీ చెల్లించక్కర్లేదు..**

'యూపీఏ ద్వారా చేసే చెల్లింపులపై వినియోగదారులు ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. వ్యాపారుల చెల్లింపుల వ్యవస్థలో ఎండీఆర్ ఒక రకమైన చార్జీ. ఇది యూపీఐ చెల్లింపులు జరిపే వినియోగదారులపై విధించే చార్జీ కాదు. వ్యక్తులు ఎప్పటిలాగే ఎలాంటి పరిమితులు, కోటాలు లేకుండా పూర్తి ఉచితంగా యూపీఐ లావాదేవీలు కొనసాగించవచ్చు' అని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఎండీఆర్‌ను కస్టమర్ల నుంచి వసూలు చేయరాదని.. వ్యాపారులే భరించాలని స్పష్టం చేసింది. అలాగే ఎండీఆర్ చార్జీల భారాన్ని వ్యాపారులు వినియోగదారులపై మోపకుండా చూడాలని బ్యాంకులను ఆదేశించింది. అదే సమయంలో యూపీఐ యాప్‌ల ప్రొవైడర్లు ప్లాట్‌ఫాం ఫీజులు లేదా హిడెన్ చార్జీలు వసూలు చేయడాన్ని నిషేధించింది.

**కీలక రంగాలకు యూపీఐ చెల్లింపులపై..**

అయితే రైల్వే టికెట్ల బుకింగ్, టెలికం రీచార్జీలు, బీమా ప్రీమియం చెల్లింపులు, పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపుకోవడం వంటి వాటికి వ్యక్తులు రూ. 2 వేలకుపైగా జరిపే యూపీఐ చెల్లింపులపై ఒక్కో లావాదేవీకి రూ. 5 చొప్పున ఎండీఆర్ వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. అలాగే రూ. 2 వేలకు మించిన విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, పైప్డ్ గ్యాస్ బిల్లులపై జరిపే యూపీఏ చెల్లింపులతోపాటు రూ. 2 వేలకు మించిన స్కూలు ట్యూషన్ ఫీజు, యూనివర్సిటీ ఫీజు చెల్లింపులపైనా ఒక్కో లావాదేవీపై రూ. 5 చొప్పున ఎండీఆర్ ఉంటుందని పేర్కొంది. అయితే రూ. 2 వేలకన్నా తక్కువగా ఉండే బిల్లులు, ఫీజులపై మాత్రం ఎలాంటి టీడీఆర్ ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. మరోవైపు మ్యూచువల్ ఫండ్లు, సెక్యూరిటీల చెల్లింపులు, స్టాక్‌బ్రోకర్లు, డీలర్ల ద్వారా జరిపే చెల్లింపులపై 0.02 శాతం టీడీఆర్ వర్తిస్తుందని తెలిపింది. అయితే వ్యక్తుల ఖాతా నుంచి వ్యాపారుల ఖాతాకు నేరుగా జరిగే యూపీఐ చెల్లింపులకు మాత్రమే ఎండీఆర్ వర్తిస్తుందని.. యుటిలిటీ బిల్లులు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లు, పునరావృత పెట్టుబడులకు సంబంధించి అమలయ్యే యూపీఐ మ్యాండేట్‌లు లేదా ఆటోపే విధానాలకు ఎండీఆర్ ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది.

**ఎందుకీ చార్జీ?**

మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ద్వారా వసూలయ్యే మొత్తంలో కొంత యూపీఐ లావాదేవీల సేవలు అందిస్తున్న బ్యాంకులు, యాప్‌లకు పంచుతామని ఎన్‌పీసీఐ తెలిపింది. అలాగే మిగిలిన మొత్తాన్ని దేశంలో మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల ఊతానికి, నూతన ఆవిష్కరణాలు, సైబర్ సెక్యూరిటీ, కస్టమర్ సర్వీస్ రంగాలకు ఉపయోగిస్తామని వివరించింది. అలాగే టైర్--3 పట్టణాలు, ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ--కాశ్మీర్, లద్దాఖ్‌లలో డిజిటల్ చెల్లింపుల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ఆర్థిక రాయితీలు ఇవ్వడానికి ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనుంది. కొత్త వ్యాపారులను డిజిటల్ పరిధిలోకి తీసుకురావడానికి ఈ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించనుంది. దేశంలో 2021లో కోవిడ్ వ్యాప్తి వేళ యూపీఐ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఎండీఆర్ చార్జీని తొలగించిన కేంద్ర ప్రభుత్వం.. దీనివల్ల బ్యాంకులు, పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లకు అయ్యే వ్యయాన్ని బడ్జెట్ కేటాయింపుల ద్వారా భరిస్తూ వచ్చింది. అయితే యూపీఏ సేవల నిర్వహణ, సర్వర్ల బ్యాండ్‌విడ్త్ వ్యయం, బ్యాంకుల సాంకేతిక సహాయ ఖర్చులు ఏటా సుమారు రూ. 20 వేల కోట్లను చేరడంతో తమ బడ్జెట్ కేటాయింపుల ద్వారానే ఆ మొత్తాన్ని భర్తీ చేయలేమని కేంద్రం చెబుతోంది. యూపీఐని నిర్వహిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకారం ఆగస్టులో దేశవ్యాప్తంగా రూ.29,82,356 కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి. అలాగే లావాదేవీల సంఖ్య 2,451 కోట్లు దాటింది.

**లావాదేవీల వాటా ఇలా..**

-- ఆగస్టులో నమోదైన యూపీఐ లావాదేవీల సంఖ్యలో 63 శాతం వాటా వ్యాపారులకు చేసిన చెల్లింపులదే.

-- వ్యాపారులకు చేసిన మొత్తం చెల్లింపుల్లో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీల వాటా 67 శాతం. అంటే వ్యాపార రంగంలో జరిగే మెజారిటీ నగదు చలామణి పెద్ద మొత్తాల్లోనే సాగుతోంది.

-- సంఖ్య పరంగా చూస్తే రూ.2,000 పైబడిన లావాదేవీలు కేవలం 4 శాతం మాత్రమే. కానీ విలువ పరంగా అవి 67 శాతం ఉండటం వల్ల ఎలక్ట్రానిక్స్ కొనుగోళ్లు, బట్టలు, బంగారు ఆభరణాలు, విమాన/రైలు టికెట్లు, హోటల్ బిల్లుల వంటి పెద్ద చెల్లింపులపై ఈ అదనపు భారం పడనుంది.

-- వ్యాపారులు ఈ ఎండీఆర్ భారాన్ని తాము భరించలేక వినియోగదారులపైకి నెట్టేసే ప్రమాదం ఉంది. దీనివల్ల పెద్ద కొనుగోళ్లు చేసేటప్పుడు ప్రజలు యూపీఐని పక్కనపెట్టి మళ్లీ నగదు వైపు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది.

-- నెలవారీ వ్యాపార టర్నోవర్ రూ.1 లక్ష లోపు ఉన్న చిన్న చిన్న దుకాణదారులకు ఈ రుసుము నుండి పూర్తి మినహాయింపు ఇచ్చారు.

-- ఒకరి ఖాతా నుంచి మరొకరి ఖాతాకు పంపే వ్యక్తిగత నగదు బదిలీల విషయానికి వస్తే మొత్తం యూపీఐ లావాదేవీల విలువలో దీని వాటా అత్యధికంగా 70 శాతం.

-- పర్సన్--టు--పర్సన్ విభాగంలో జరిగిన మొత్తం లావాదేవీల విలువలో రూ.2,000 కంటే ఎక్కువ విలువైన బదిలీల వాటా ఏకంగా 85 శాతం నమోదైంది.

-- సంఖ్య పరంగా ఇవి 18 శాతం మాత్రమే అయినప్పటికీ, విలువలో 85 శాతం కలిగి ఉండటం గమనార్హం.

మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్): మనం ఏదైనా దుకాణానికి వెళ్లి డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ పద్ధతిలో డబ్బులు చెల్లించినప్పుడు.. ఆ సేవను అందించినందుకు బ్యాంకులు, చెల్లింపు కంపెనీలు వ్యాపారి నుండి వసూలు చేసే రుసుము.

-- డిజిటల్ చెల్లింపు చేసినప్పుడు ఆ డబ్బు వినియోగదారుడి ఖాతా నుండి వ్యాపారి ఖాతాకు సురక్షితంగా చేరాలి. దీనికోసం పని చేసే బ్యాంకులు, కార్డు కంపెనీలు, యాప్‌లు తమ సాఫ్ట్‌వేర్, భద్రతను నిర్వహించడానికి ఈ ఛార్జీని తీసుకుంటాయి.

-- నిబంధనల ప్రకారం ఈ భారాన్ని వ్యాపారస్తులే భరించాలి. వినియోగదారులు కాదు. ఉదాహరణకు ఈ రుసుము 1 శాతం ఉందనుకుందాం. దుకాణంలో మీరు రూ.3,000 చెల్లిస్తే వ్యాపారికి రూ.2,700 మాత్రమే అందుతాయి. ఛార్జీల కింద రూ.30 కట్ అవుతుంది.

-- వ్యాపారస్తులు తమ లాభాలు తగ్గిపోకుండా ఉండటానికి ఈ భారాన్ని వస్తువుల ధరలు పెంచి చివరికి వినియోగదారుల పైకే నెట్టేసే ప్రమాదం ఉంది.

# 'పాక్‌కు ఇలాంటి జిమ్మిక్కులు కొత్తేం కాదు'



జైషే మహ్మద్ చీఫ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజర్‌పై పాకిస్థాన్ మరోసారి రివార్డ్ ప్రకటించడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఆ ప్రకటనను జిమ్మిక్కులుగా కొట్టిపారేసింది. కేవలం ప్రకటనలతో అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించలేరని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో పాకిస్థాన్ నిజంగా చర్యలు తీసుకోవాలని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

మసూద్ అజర్‌పై బహుమతి కొనసాగిస్తున్నట్లు ప్రటకన పాక్? చేసే ఇటువంటి జిమ్మిక్కులు, ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు కొత్తేమీ కాదని జైస్వాల్ ఎద్దేవా చేశారు. ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న దేశం ఇలాంటి బూటకపు ప్రకటనలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. పాక్ నిజంగా ఉగ్రవాదంపై పోరాడాలను కుంటే కఠినమైన, స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకటనలు చేయడం కాకుండా ఉగ్రవాద సంస్థలు, వాటి నాయకత్వంపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఇస్లామాబాద్‌పై ఉందని స్పష్టం చేసింది.

**భారత్‌కు మోస్ట్ వాంటెడ్**

మసూద్ అజర్ పేరు పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్?ఐఏ) రెడ్ బుక్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో ఉంది. భారత్‌లో జరిగిన పలు కీలక ఉగ్రదాడులతో అతడికి సంబంధాలున్నాయని భారత దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. 2001 పార్లమెంట్‌పై దాడి, 2008 ముంబయి ఉగ్రదాడులు, 2016 పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి, 2019 పుల్వామా ఉగ్రదాడి వంటి ఘటనల నేపథ్యంలో మసూద్ అజర్ భారత్‌కు అత్యంత కీలకమైన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడిగా ఉన్నాడు. అతడిని 2019 మేలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇదిలా ఉండగా, మసూద్ అజర్ తమ దేశంలో లేడని, అతడు అఫ్గానిస్థాన్?కు పారిపోయాడని పాకిస్థాన్ కొంతకాలంగా చెబుతోంది. జైషే మహ్మద్ అధినేత అఫ్గాన్? నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నాడని ఇస్లామాబాద్ వాదిస్తోంది. అయితే పాక్ వాదనను అఫ్గాన్? తాలిబన్ ప్రభుత్వం ఇటీవల ఖండించింది. అజర్ తమ దేశంలో లేడని అక్కడి విదేశాంగ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి స్పష్టం చేశారు.

**మూడు పరస్పర అంశాలపై భారత్–చైనా సంబంధాలు**

మరోవైపు భారత్–చైనా సంబంధాలపైనా జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలకు గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అనే మూడు పరస్పర అంశాలపై ఆధారపడి ఉండాలని పునరుద్ఘాటించారు. 18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా జిన్?పింగ్? భేటీలో భారత ప్రధాన ఆందోళనలను మోదీ ప్రస్తావించినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

'భారత్–చైనా సంబంధాలు మెరుగుపడాలంటే సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత తప్పనిసరి అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, అవగాహనలను ఇరుదేశాలు గౌరవించాలని పేర్కొన్నారు. అదే సమయంలో సరిహద్దు వివాదానికి దీర్ఘకాలిక, రాజకీయ పరిష్కారం కోసం చర్చలు కొనసాగించేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన, న్యాయమైన పరిష్కారం దిశగా ముందుకు సాగాలని నిర్ణయించాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాల్లో ఉమ్మడి ప్రయోజనాలను మరింత విస్తరించుకోవాలని కూడా ఇరుదేశాలు అభిప్రాయపడ్డాయి' అని రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

**బీజింగ్ వ్యాఖ్యలకు భిన్నంగా దిల్లీ వైఖరి**

ఇదిలా ఉండగా, చైనా తన ప్రకటనలో భారత్, చైనాలను 'ప్రత్యర్థుల కంటే భాగస్వాములు'గా పేర్కొన్నప్పటికీ, దిల్లీ మాత్రం అదే పదజాలాన్ని ఉపయోగించలేదు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడం, పరస్పర గౌరవం, ఇరుదేశాల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంపైనే భారత్ దృష్టి పెట్టింది. తైవాన్, టిబెట్ అంశాల్లో భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించిందంటూ చైనా ప్రకటనలో పేర్కొన్న అంశాలపై, భారత అధికారిక ప్రకటనలో మాత్రం ప్రధానంగా సరిహద్దు శాంతి, ఒప్పందాల అమలు వంటి మూడు అంశాలకే ప్రాధాన్యత లభించింది.

## మనం ఇంకా సిద్ధం కాలేదు..
## ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి



టెక్నాలజీ రంగంలో ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలిచే మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఏఐ' పురోగతి వేగాన్ని కొంతమేర తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ సాంకేతికత తీసుకురాబోయే భారీ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచం ఇంకా సిద్ధంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక అంశాలను పంచుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది గతంలోని పర్సనల్ కంప్యూటర్లు లేదా ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణల కంటే భిన్నమైనదని, ఇది సమాజంలో లోతైన మార్పులకు కారణమవుతుందని బిల్ గేట్స్ వివరించారు. "ఇంత వేగవంతమైన, విస్తృతమైన మార్పులకు మనం ఇంకా సంసిద్ధం కాలేదు. నిరంతరం ఆవిష్కరణలను ప్రోత్సహించే నేనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యంగా అనిపించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత సైబర్ దాడుల రూపంలో పెను ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మోడల్స్ నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు వచ్చిన 'హగ్గింగ్ ఫేస్ ఘటన'ను ఆయన ప్రస్తావించారు. ఇటీవల టెస్లా అధినేత ఎలాన్ మస్క్, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వంటి టెక్ దిగ్గజాలు సైతం ఏఐ అభివృద్ధి వేగం పట్ల ఇటువంటి ఆందోళనలనే వ్యక్తం చేశారు. ఇప్పుడు బిల్ గేట్స్ కూడా వారి వాదనతో ఏకీభవించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, ఏఐ వల్ల అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయని గేట్స్ ఫౌండేషన్ విశ్వసిస్తోంది. తమ 'గోల్‌కీపర్స్ రిపోర్ట్'లో పేర్కొన్నట్లుగా, ఏఐని సరైన మార్గంలో నడిపిస్తే, అది సామాజిక సమానత్వాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతుందని వెల్లడించింది. ఈ దిశగా, సమానత్వంతో కూడిన ఏఐ అభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ 1 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు స్పష్టం చేసింది.

## అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు..
## తీవ్రంగా స్పందించిన చైనా

అంతరిక్షంలో అమెరికా ఆయుధాలను మోహరించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. అంతరిక్షంలో సైనిక కార్యకలాపాలను, ఆయుధ సమీకరణను తక్షణమే నిలిపివేయాలని వాషింగ్టన్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంతరిక్షంలో తమ వద్ద "కక్ష్య నియంత్రణ ఆయుధాలు" ఉన్నాయని యూఎస్ ఎయిర్ ఫోర్స్ సెక్రటరీ ట్రాయ్ మీంక్ బహిరంగంగా అంగీకరించిన మరుసటి రోజే చైనా ఈ విధంగా స్పందించింది. తమ బలగాలపై జరిగే శత్రు దాడులను తిప్పికొట్టేందుకే ఈ ఆయుధాలను మోహరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే, ఇవి ఎలాంటి ఆయుధాలు, వాటి సామర్థ్యాలేమిటనే వివరాలను మాత్రం ఆయన బహిర్గతం చేయలేదు. ఆ వివరాలు వెల్లడిస్తే వాటి వ్యూహాత్మక ప్రాధాన్యత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. "అంతరిక్షాన్ని కేవలం శాంతియుత ప్రయోజనాలకే వినియోగించాలి. దానిని యుద్ధ క్షేత్రంగా మార్చే ఏ ప్రయత్నాన్నైనా చైనా వ్యతిరేకిస్తుంది. స్పేస్‌లో ఆయుధ పోటీని మేం నిరోధిస్తాం. అమెరికా తన సైనిక కార్యకలాపాలను నిలిపివేసి, ప్రపంచ వ్యూహాత్మక స్థిరత్వాన్ని కాపాడాలి" అని చైనా తన ప్రకటనలో స్పష్టం చేసింది. 1967 నాటి అంతరిక్ష ఒప్పందం ప్రకారం రోదసిలో అణుబాంబులు వంటి సామూహిక విధ్వంసక ఆయుధాల వినియోగాన్ని నిషేధించారు. అయితే, ఉపగ్రహాలను అడ్డుకునే సంప్రదాయ ఆయుధాలపై ఎటువంటి నిషేధం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్' మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో భాగంగానే ఈ సైనిక విస్తరణ జరుగుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు, చైనా, రష్యాలు కూడా ఇటువంటి కౌంటర్–స్పేస్ సామర్థ్యాలను అభివృద్ధి చేస్తుండటంతో, రోదసిలో కొత్త ఆయుధ పోటీ ప్రారంభమైందన్న ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి.

## పరస్పర సున్నితత్వం పాటించాలి

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

## మోదీ మళ్లీ రాజీపడ్డారు

దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై కేంద్రం తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ లావాదేవీలపై చార్జీలు విధించేందుకు మార్గం సుగమం చేస్తోందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. రూ.2 వేలకుపైబడిన వ్యాపారి యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించడం ద్వారా జీరో–చార్జీ విధానాన్ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని అమెరికా చెల్లింపు సంస్థల ఒత్తిడితో ముడిపెట్టిన ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించేందుకు ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేస్తోంది. రూ.2 వేలకుపైబడిన వ్యాపార సంబంధిత యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో ఎండీఆర్ విధించే అవకాశం ఉంది. యూపీఐ లావాదేవీల పరిమాణంలో రూ.2వేలకు పైబడిన చెల్లింపులు కేవలం ఐదు మాత్రమే ఉన్నాయి. అయితే విలువ పరంగా చూస్తే ఇవే దాదాపు 65 శాతం వరకు ఉంటాయి. వినియోగదారుల నుండి ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. కానీ కస్టమర్ల నుంచి నేరుగా ఎలాంటి యూపీఐ ఫీజు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. అయితే దుకాణదారులపై విధించే చార్జీలను ఎవరు భరిస్తారు? అవి వస్తువుల ధరల్లోకి చేరి చివరకు వినియోగదారుల జేబు నుంచే బయటకు వస్తాయి' అని రాహుల్ గాంధీ అన్నారు.

**అమెరికా కంపెనీల ఒత్తిడే కారణమా?**

భారత్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న జీరో ఎండీఆర్? విధానంపై అమెరికాకు చెందిన చెల్లింపు సంస్థలు చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. యూపీఐ ద్వారా చెల్లింపులు జరిగినప్పుడు వ్యాపారుల నుంచి ఎండీఆర్ వసూలు చేయకపోవడం వల్ల చెల్లింపు సంస్థలకు ఆదాయ అవకాశాలు పరిమితమవుతున్నాయన్న వాదనలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తీసుకున్న చర్యలు, గతంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును గుర్తు చేస్తున్నాయని రాహుల్ అన్నారు. అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ మరోసారి లొంగిపోయారని వ్యాఖ్యలు చేశారు.

**కేంద్రంపై ఖర్గే ఫైర్**

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై చార్జీలు విధించేందుకు కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు. రూ.2 వేల వరకు జరిగే యూపీఐ లావాదేవీలకు మాత్రమే చార్జీలు ఉండవని పరిమితి విధించడం ద్వారా భవిష్యత్తులో పెద్ద మొత్తాల డిజిటల్ చెల్లింపులపై ఫీజులు విధించే అవకాశం కల్పించారని విమర్శించారు. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణంతో సామాన్యులపై ఆర్థిక భారం పెరిగిందని, ఇప్పుడు డిజిటల్ చెల్లింపులపైనా అదనపు భారం మోపే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు.

**పెద్ద నోట్ల రద్దును గుర్తు చేసిన ఖర్గే**

యూపీఐ చార్జీల అంశాన్ని పెద్ద నోట్ల రద్దుతో ముడిపెట్టి ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దశాబ్దం క్రితం నోట్ల రద్దు నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల ఎదురైన పరిణామాలపై ప్రశ్నలు తలెత్తినప్పుడు.. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమే ఆ నిర్ణయం వెనుక ఉద్దేశమని ప్రభుత్వం వివరించిందని గుర్తుచేశారు. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అప్పట్లో కేంద్రం చెప్పిందని తెలిపారు. అదే సమయంలో ఇటీవల పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి యూపీఐపై ఎలాంటి పన్ను లేదా చార్జీలు విధించబోమని చెప్పినట్లు ఖర్గే గుర్తుచేశారు. అయితే తాజాగా రూ.2 వేలకుపైబడిన లావాదేవీలకు సంబంధించి చార్జీల అంశం తెరపైకి రావడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**'రానున్న కాలంలో ౹ా2ూ చెల్లింపులకూ చార్జీలు?'**

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ కూడా ఈ వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విధించిన లావాదేవీ పరిమితిని భవిష్యత్తులో మరో నోటిఫికేషన్ ద్వారా మార్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇప్పుడు రూ.2 వేల పరిమితి ఉన్నప్పటికీ, రానున్న రోజుల్లో దీనిని మార్చి ఇతర రకాల యూపీఐ లావాదేవీలపైనా ఫీజులు విధించే అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే సాధారణ యూపీఐ చెల్లింపులు కూడా భవిష్యత్తులో చార్జీల పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డిజిటల్ చెల్లింపుల రంగాన్ని అమెరికా కంపెనీలకు మరింత అనుకూలంగా మార్చేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారా అని నిలదీశారు. ప్రభుత్వం పారదర్శకత, నిజాయతీ విషయంలో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని ఆయన విమర్శించారు. యూపీఐ వినియోగదారుల్లో అనవసరమైన ఆందోళనకు తావిచ్చేలా నిర్ణయాలు ఉండకూడదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రూ.2వేలకు పైబడిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ ఛార్జీలపై త్వరలో బ్యాంకుల ప్యానెల్? ఒక నిర్ణయం తీసుకొనున్నట్లు సమాచారం. ఈ ప్యానెల్?లో యూపీఐ అండ్

# కూలుతున్న నగరాలు!

## సంపాదకీయం

మన నగరాలు పేరు గొప్ప.. ఊరు దిబ్బేనా! ఆకాశహర్మ్యాల మెరుపు, భారీ మాల్స్ ఆర్భాటం, స్మార్ట్ సిటీల ప్రచారం వెనుక దాగివున్న చేదునిజం –మౌలిక వసతులు కుప్పకూలే స్థితికి చేరాయి, పట్టించుకునే వారూ కరవయ్యారు. రోడ్లు పగుళ్లు.. డ్రైనేజీలు పొంగిపొర్లు.. వరదలు మామూలే.. విచ్చలవిడిగా అనధికార కాలనీల విస్తరణ.. ప్రాణాలు తీస్తున్న కాలుష్యం.. విద్యుత్, నీటి సరఫరా అనిశ్చితం.. ప్రాణాలు కబళిస్తున్న మ్యాన్‌హోళ్లు, గుంతలు. ఇదీ సాధారణ పౌరుడు నగరంలో నిత్యం ఎదుర్కొనే పీడకల. ఇటీవల ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఐదంతస్తుల పీజీ హాస్టల్ భవనం కూలిపోవడం ఈ దుస్థితికి భయంకరమైన నిదర్శనం! నిర్మాణపరమైన లోపాలు, అనధికార మార్పులు, పర్యవేక్షక అధికారుల నేరపూరిత నిర్లక్ష్యం ఈ దుర్ఘటనకు కారణమన్నది ప్రాథమిక నివేదిక. విషాదమేమిటంటే, ఢిల్లీ ఒక్కచోటే లక్షలాది విద్యార్థులు ఇలాంటి పీజీల్లోనే నివసిస్తున్నారు. యువతను గొప్పగా పొగుడుకుంటాం. అదే సమయంలో నిర్లక్ష్యపు చావులకు వదిలేస్తున్నాం. ఈ వైఫల్యాలు కేవలం మహానగరాలకే కాదు, ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలు వేగంగా పట్టణీకరణ చెందుతున్నా, పూర్తిగా అస్తవ్యస్తంగా సాగుతోంది. ఈ పరివర్తనను ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికా సంస్థలు, సాంకేతిక సిబ్బంది, ఆర్థిక వనరులు లేకుండానే మార్పు జరుగుతోంది.

అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే భారత్‌లో పట్టణీకరణ కనిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ.. మనం ఇంత దయనీయ స్థితిలో ఉండటం విడ్డూరం. ప్రపంచ బ్యాంక్ గణాంకాల ప్రకారం, 2025లో భారత్ జనాభాలో 35.7 శాతం మాత్రమే పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దీనితో పోలిస్తే చైనాలో ఇది ఇప్పటికే 66.3 శాతానికి చేరుకుంది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఈ వ్యత్యాసం మరింత స్పష్టం. అమెరికాలో సుమారు 80 శాతం, కెనడాలో 82 శాతం, జర్మనీలో 78 శాతం, బ్రిటన్‌లో 85 శాతం పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రధానాంశం ఏమిటంటే, చైనా, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారత్‌లో పట్టణీకరణ తక్కువగా ఉన్నప్పటికీ, మౌలిక వసతులు మాత్రం అస్తవ్యస్తం. దీంతో భారత్ చిత్రమైన సవాలు ఎదుర్కొంటోంది. మనకు తక్కువస్థాయి పట్టణీకరణ ఉన్నప్పటికీ, అత్యధిక సంఖ్యలో పట్టణ జనాభా ఉంది. కేవలం 36 శాతం పట్టణీకరణ వద్దే, ఇది వందల మిలియన్ల మంది పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్నారని అర్థం. ఈ నిష్పత్తి భవిష్యత్తులో మరింత పెరగనుంది. దేశం పూర్తిస్థాయి పట్టణ ప్రధానంగా మారకముందే, ఈ పరివర్తనను నిర్వహించగల సమర్థమైన సంస్థలను నిర్మించుకునేందుకు మనకు ఇంకా సమయం ఉంది. విఫలమైతే, నేటి గుంతలు, పొంగిపొర్లే డ్రైనేజీలు రేపటి వ్యవస్థాగత సంక్షోభం కాకపోవు. భారీస్థాయిలో పట్టణీకరణ జరిగినప్పుడు రవాణా, నీరు, మురుగునీటి పారుదల, గృహనిర్మాణం, వ్యర్థాల నిర్వహణ, పురపాలక పాలనలో భారీ పెట్టుబడులు అవసరమవున్నది చైనా అనుభవం. విధానపరమైన నిర్లక్ష్యంతో పాటు, విస్తృతంగా, నిరంతరాయంగా కొనసాగుతున్న అవినీతే మన నగరాల దుస్థితికి మూలకారణం. పురపాలక అధికారులు, పోలీసులు, కాంట్రాక్టర్లు, రాజకీయ వర్గం వరకు విస్తరించిన దాదాపు సంస్థాగతీకరించిన లంచాల గొలుసు ఇప్పుడు ఒక వాస్తవికతగా మారింది. మనకున్న పౌర అసమానత వ్యవస్థలో, శక్తిమంతులు లుటియెన్స్ ఢిల్లీవంటి జాగ్రత్తగా అల్లారుముద్దుగా చూసుకునే ప్రాంతాల్లో నివసిస్తారు. డబ్బున్నవారు క్రమంగా గేటెడ్ కమ్యూనిటీలు, విలాసవంతమైన అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలో నివసిస్తున్నారు. వారు ప్రైవేట్ భద్రత, జనరేటర్లు, నీటి ట్యాంకర్లు, హౌస్‌కీపింగ్, వ్యర్థాల నిర్వహణ ద్వారా ప్రభుత్వ మౌలిక వసతుల లోపాన్ని భర్తీ చేసుకోగలరు. అంటే, వారు పురపాలక వైఫల్యంనుంచి రక్షణను కొనుక్కోగలరు. ఈ అధికార, ధన సంపన్న వర్గానికి వెలుపల ఉన్న అత్యధిక సాధారణ ప్రజలే దీని నిజమైన బాధితులు.

మనం తరచుగా 'స్మార్ట్ సిటీస్ మిషన్', డిజిటల్ పాలన, కృత్రిమ మేధ గురించి మాట్లాడుతుంటాం. కానీ అత్యంత ప్రాథమిక పౌర వ్యవస్థలే పనిచేయని నగరాన్ని 'స్మార్ట్' అని పిలవడంలో విచిత్రమైన అసంబద్ధత దాగివుంది. ఒక పిల్లవాడు బడికి నడిచి వెళ్లేందుకు సురక్షితమైన కాలిబాట లేని నగరపు తెలివితేటలు ఏమిటి? ఒక పౌరుడు మూతలేని మ్యాన్‌హోల్‌లో పడిపోయే నగరపు నైపుణ్యమేమిటి? సాంకేతికత పురపాలక సామర్థ్యానికి ప్రత్యామ్నాయం కాలేదు. ప్రాథమిక సేవలు అంచనా వేయదగిన రీతిలో పనిచేసే నగరమే నిజమైన స్మార్ట్ సిటీ. మన నగరాలను మరింత నివాసయోగ్యంగా మార్చాలంటే, –మొదటి సంస్కరణ ఆర్థికపరమైనది కావాలి. కఠినమైన ఆర్థిక భద్రతా చర్యలకు లోబడి, మౌలిక వసతుల కోసం దీర్ఘకాలిక రుణాలు తీసుకునే వెసులుబాటు పురపాలక సంస్థలకు ఇవ్వాలి. రెండోది.. జీఐఎస్ మ్యాపింగ్, పారదర్శక విలువ నిర్ధారణ ద్వారా ఆస్తి పన్ను వ్యవస్థను ఆధునీకరించాలి. మూడోది.. స్వతంత్ర పురపాలక ఆడిట్లతో స్పష్టమైన జవాబుదారీతనం అవసరం. ప్రతి ప్రధాన పురపాలక ఆస్తికి డిజిటల్ గుర్తింపు ఉండాలి. నాలుగోది, వ్యవస్థను హేతుబద్ధీకరించాలి. పురపాలక సంస్థలు, అభివృద్ధి అథారిటీలు, నీటి బోర్డులు, రవాణా సంస్థల మధ్య బాధ్యత విభజించబడి జవాబుదారీతనం పలచబడకూడదు. ఐదోది, అత్యంత ముఖ్యమైనది.. సంక్షిప్త శిక్షలు, పారదర్శకత ద్వారా అవినీతిని ఎదుర్కోవాలి. టెండర్లు, కాంట్రాక్టులు, తనిఖీ నివేదికలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండాలి. అయితే పౌరుల నిర్లిప్తత మారనంత వరకు ఏదీ మారదు. చాలాకాలంగా, ప్రతి దురాగతానికీ కొంత ప్రజాగ్రహం వ్యక్తమవుతుందని, ఆ తర్వాత సంక్షోభం సద్దుమణుగుతుందని వ్యవస్థ నిర్లక్ష్యంగా భావిస్తూ వచ్చింది. ఈ నిర్లక్ష్యపూరిత, అవినీతిగ్రస్త వ్యవస్థ మారాలంటే, పౌరులు తామంతట తాముగా సంఘటితమై జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసి, "ఇక చాలు" అని గట్టిగా చెప్పినప్పుడే మార్పు సాధ్యమవుతుంది.

భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ప్రపంచ వేదికపై తనను తాను నిరూపించుకోవాలని చూస్తున్న తరుణంలో, తన నగరాల్లో ప్రాథమిక సేవలను కూడా అందించలేని స్థితిలో ఉండటం ఒక పెద్ద వైరుధ్యం. ఈ వైరుధ్యాన్ని అధిగమించడానికి రాజకీయ సంకల్పం, పరిపాలనా సామర్థ్యం, పౌర భాగస్వామ్యం మూడూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే రేపటి తరాలు మరింత దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి రాక తప్పదు!

### పనికొచ్చే పలుకు



## వినయమే.. మీ విజయం!

వ్యాపార రంగంలో వేగంగా ఎదగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ వేగవంతమైన ఎదుగుదలకు కావాల్సిన అసలైన పునాది ఏమిటో తెలుసుకోరు. తెలివితేటలు, పెట్టుబడి, కష్టపడే తత్వం ఎంత ముఖ్యమో, వినయంతో నడుచుకోవడమూ అంతే ముఖ్యం. ఇతరులను కించపరిచే అలవాటుంటే, ఎంత గొప్ప వ్యాపార వ్యూహమున్నా.. అది సున్నా. ఎందుకంటే వ్యాపారం కేవలం లావాదేవీలతో కూడినది కాదు.. అది మనుషులతో కూడిన సంబంధం. ఎవరినైనా ఎగతాళి చేసి మాట్లాడితే, ఆ క్షణంలో మీకు ఒక చిన్న సంతృప్తి దొరకవచ్చు గానీ, దీర్ఘకాలంలో ఒంటరిగా మిగిలిపోతారు.

వ్యాపారంలో విజయం సాధించాలంటే కొత్త ఆలోచనలు, సలహాలు, భిన్న దృక్కోణాలు అవసరం. ఇవి ఒక్కరి తలలో నుంచే పుట్టవు. ఉద్యోగులు, సహోద్యోగులు, భాగస్వాములు, కస్టమర్లు అందరి నుంచీ వస్తాయి. కానీ మీరు ఎవరినైనా కించపరిచే స్వభావం కలిగి ఉంటే, ఎవరూ మీతో తమ ఆలోచనలను నిర్భయంగా పంచుకోరు. ఒక ఉద్యోగి తనకు తోచిన మంచి సలహా ఇవ్వాలనుకున్నా, "ఇది చెబితే నన్ను హేళన చేస్తారేమో" అనే భయం మనసులో మెలుచుకొస్తుంది. అలా భయంతో నోరు మూసుకున్న ప్రతి ఉద్యోగీ, అసలు మీ సంస్థకు రాగల ఒక గొప్ప ఆలోచనను దూరం చేస్తున్నట్టే. కాలక్రమేణా, మీ చుట్టూ ఉన్నవారంతా మౌనంగా ఉండటం అలవాటు చేసుకుంటారు. దీనివల్ల మీకు నిజమైన ఫీడ్‌బ్యాక్ ఎప్పుడూ అందదు, మీరు తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా మారతాయి.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గమనించాలి.. వినయం బలహీనత కాదు. చాలామంది వినయాన్ని పిరికితనంగా, తక్కువతనంగా భావిస్తారు. కానీ నిజానికి వినయం శక్తివంతమైన నాయకత్వ లక్షణం. చరిత్రలో గొప్ప వ్యాపారవేత్తలను, నాయకులను పరిశీలిస్తే, వారు తమ విజయాల్లో అహంకారం చూపించకుండా, ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని గౌరవించిన వారేనని అర్థమవుతుంది. ఎందుకంటే వినయంగా ఉండేవారికి తమ పరిమితులు తెలుసు, తమకు తెలియని విషయాలు ఇంకా చాలా ఉన్నాయని వారు గుర్తిస్తారు. ఈ గుర్తింపే వారిని నిరంతరం నేర్చుకునేలా చేస్తుంది. అదే అహంకారంతో ఉండేవారు, తమకు అన్నీ తెలుసునన్న భ్రమలో ఉండి, కొత్త అవకాశాలను, కొత్త ఆలోచనలను కోల్పోతారు.

ఇతరులను ఎగతాళి చేసే అలవాటు వ్యక్తిగత సంబంధాలపైనే కాదు, వృత్తిపరమైన నెట్‌వర్క్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యాపార ప్రపంచం చాలా చిన్నది. ఈరోజు మీరు కించపరిచిన వ్యక్తి రేపు మీకు ఒక ముఖ్యమైన కస్టమర్‌గానో, భాగస్వామిగానో, లేదా పోటీ సంస్థలో నిర్ణయాధికారిగానో ఎదురుపడొచ్చు. ఒక్కసారి మీ గురించి "అహంకారి", "ఇతరులను చిన్నచూపు చూసేవాడు" అన్న పేరు స్థిరపడితే, అది మీ వ్యాపార అవకాశాలను నిశ్శబ్దంగా దెబ్బతీస్తుంది. మనుషులు తమను గౌరవించే వారితోనే వ్యాపారం చేయాలని కోరుకుంటారు, తమను తక్కువ చేసి చూసేవారితో కాదు. కాబట్టి దీర్ఘకాలంలో మీ ప్రవర్తనే మీ బ్రాండ్‌గా మారుతుంది.

చివరగా, ఇతరులను కించపరచడం మానేసి, వినయంతో నడుచుకోవడం అలవాటు చేసుకుంటే, మీ చుట్టూ ఒక సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. ప్రజలు మీతో నిర్భయంగా మాట్లాడతారు, కొత్త ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకుంటారు, మీపై నమ్మకంతో పనిచేస్తారు. ఇదే మీ వ్యాపారానికి, మీ వృత్తిపరమైన ఎదుగుదలకు నిజమైన ఇంధనంగా మారుతుంది. కాబట్టి వేగంగా ఎదగాలనుకునే ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన సత్యం ఒక్కటే --- గొప్పతనం అంటే ఎత్తుకు ఎదగడం మాత్రమే కాదు, ఆ ఎత్తులో ఉన్నప్పుడు కూడా నేలపైనే నిలబడి ఉండటం. అదే నిజమైన వినయం, అదే నిజమైన నాయకత్వం.

# బ్రిక్స్ వేదికపై భారత్ చాతుర్యం





అంతర్జాతీయ రాజకీయాలు సంఘర్షణలతో నిండిన ఈ తరుణంలో రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు భారత్ అద్భుతమైన ఆతిథ్యాన్ని అందించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రెండు ప్రధాన యుద్ధాల్లో ఒకదానిలో బాధితురాలిగా, మరొక దానిలో ప్రమేయమున్న దేశంగా ఉన్న సభ్యదేశాలు ఒకే కూటమిలో ఉన్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ తనదైన వ్యక్తిగత దౌత్యనీతి శైలితో ఈ అంతర్గత వైరుధ్యాలన్నింటినీ సాఫీగా సమన్వయం చేయగలిగారు. సెప్టెంబర్ 12–13 తేదీల్లో భారత్ మండపంలో జరిగిన 18వ శిఖరాగ్ర సదస్సులో, 11 సభ్యదేశాలు 140 అంశాలతో కూడిన సుదీర్ఘమైన న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించడం ఒక దౌత్యపరమైన విజయంగానే చూడాలి. 20 ఏళ్ల ప్రయాణంలో బ్రిక్స్ ఇప్పుడు గణనీయమైన ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని కలిగిన వేదికగా పరిణతి చెందింది. ఏ అగ్రరాజ్యం ఆర్థిక లేదా సైనిక శక్తినీ నేరుగా సవాలు చేయకుండానే తన ప్రభావాన్ని ఎలా వినియోగించుకోవాలో ఇది నేర్చుకుంది. ఈ డిక్లరేషన్‌లో 26 మంది ప్రాణాలు బలిగొన్న జమ్మూకశ్మీర్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించడం, గాజాలో తక్షణ కాల్పుల విరమణ, రెండు దేశాల సిద్ధాంతానికి మద్దతు పలకడం, ఐక్యరాజ్య సమితిలో భారత్, బ్రెజిల్‌లకు విస్తృత పాత్ర కల్పించాలన్న డిమాండ్ వంటివి చోటుచేసుకున్నాయి. అయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా తూర్పు దిశగా సాగే సముద్రమార్గాల ద్వారా చమురు, వాయువు, వస్తువుల స్వేచ్ఛా రవాణాపై ఆధారపడిన దేశాలను ప్రభావితం చేస్తున్న యుద్ధాలను ఖండించడంలో ఈ డిక్లరేషన్ అంత గట్టిగా ముందుకు వెళ్లలేకపోయింది. దీనికి కారణం రష్యా ఈ కూటమిలో ఒక కీలక సభ్యదేశంగా ఉండటం. 2022లో ఉక్రెయిన్‌పై దండయాత్ర చేసిన తర్వాత వ్లాదిమిర్ పుతిన్ తొలిసారిగా బ్రిక్స్ సదస్సుకు హాజరవడం కావచ్చు.

చైనా, భారత్, రష్యా వంటి దేశాలు ఈ కూటమిలో భాగంగా ఉండటంతో, చాలా నిర్ణయాత్మక ప్రక్రియల్లో ఇప్పటికీ పాశ్చాత్య దేశాల ఆధిపత్యం కొనసాగుతున్న ప్రపంచ వ్యవస్థపై, అలాగే వైట్‌హౌస్‌లో ప్రస్తుత అధినేత అవలంబిస్తున్న ఏకపక్ష సుంకాలు, ఆంక్షలు, ఇతర ఆధిపత్య సాధనాలపై ఒక విమర్శనాత్మక స్వరాన్ని వేదిక వినిపించగలిగింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా విధించే ఏకపక్ష సుంకాలు, ద్వితీయ ఆర్థిక ఆంక్షలు, పర్యావరణ విధానం ముసుగులో అమలుచేసే రక్షణవాద చర్యలైన కార్బన్ సరిహద్దు సర్దుబాటు యంత్రాంగాలను బ్రిక్స్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదించని ఆంక్షలను కూడా కూటమి ఖండించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్షంగా సదస్సులో లేకపోయినా, రెండు రోజుల సదస్సు నుంచి వెలువడిన డిక్లరేషన్ ప్రస్తుత ప్రపంచ వ్యవస్థలోని లోపాలను, గ్లోబల్ సౌత్ దేశాలు దానిపై ఎందుకు అసంతృప్తిగా ఉన్నాయో చాటిచెప్పింది. అయితే కేవలం సైనిక శక్తి కోసమే కాకుండా, ఆర్థిక ప్రభావం కోసం కూడా ప్రపంచానికి అమెరికా అవసరం అనే వాస్తవాన్ని విస్మరించలేం. బ్రిక్స్ మొత్తం వాణిజ్య టర్నోవర్ 2025లో 8.95 ట్రిలియన్ డాలర్లకు చేరుకుని, గతంతో పోలిస్తే 4 శాతం వృద్ధి నమోదు చేసినప్పటికీ, కూటమి ప్రపంచ జనాభాలో 49.5 శాతం, జీడీపీలో 40 శాతం, వాణిజ్యంలో 26 శాతం వాటాను కలిగి ఉన్నప్పటికీ, ఈ సదస్సు ఒక ఉమ్మడి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్నిగానీ, ఉమ్మడి కరెన్సీనిగానీ ఏర్పాటు చేయలేకపోయింది. ఇది కూటమి ఆచరణాత్మక పరిమితులను కూడా బహిర్గతం చేసింది.

ఈ సదస్సులో అత్యంత ఆసక్తికరమైన పరిణామం మాత్రం భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో కనిపించిన స్వల్ప మెరుగుదల. ఏడేళ్ల తర్వాత జరిగిన అత్యున్నతస్థాయి భేటీలో, భారత్–చైనా భాగస్వాములేగానీ ప్రత్యర్థులు కాదని, ద్వైపాక్షిక వాణిజ్యం కొత్త శిఖరాలకు చేరుకుందని షీ జిన్‌పింగ్ వ్యాఖ్యానించగా, ప్రస్తుత సరిహద్దు ఒప్పందాలను గౌరవించాల్సిన అవసరాన్ని మోదీ నొక్కిచెప్పారు. సరిహద్దు వివాదానికి న్యాయబద్ధమైన, హేతుబద్ధమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సాధించేందుకు కట్టుబడి ఉన్నామని ఇరు నేతలు ప్రకటించడం విశేషం. గత కొన్నేళ్లుగా అరుదుగా మాట్లాడుకున్న ఇద్దరు నేతలు అత్యంత సున్నితమైన అంశంపై ఒక ఉమ్మడి ప్రకటనను రూపొందించగలగడం ఈ సదస్సు దౌత్యపరమైన ప్రధానాంశంగా చెప్పుకోవాలి. అయితే కేవలం మాటలకే పరిమితం కాకుండా, వాస్తవాధీన రేఖ వద్ద శాంతి, ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలా, లేక అన్నిరంగాల్లో సంబంధాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రాధాన్యం ఇవ్వాలా అన్న విషయంలో ఇరుదేశాల మధ్య ప్రాథమిక భేదాభిప్రాయం ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. దీనికి తోడు, స్థానిక కరెన్సీల్లో సరిహద్దు చెల్లింపులను ప్రోత్సహించే బ్రిక్స్ పే వ్యవస్థకు, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా స్థానిక కరెన్సీ ఫైనాన్సింగ్‌కు మద్దతు ఇవ్వడం, ఐఎంఎఫ్ కోటా సంస్కరణలు, డబ్ల్యూటీఓ వివాద పరిష్కార యంత్రాంగాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్ వంటివి కూడా ఈ డిక్లరేషన్‌లో చోటుచేసుకున్నాయి. అయితే ఇవి తక్షణ ఫలితాలనివ్వక, దీర్ఘకాలిక ప్రక్రియలుగానే మిగిలిపోనున్నాయి.

అయితే ఈ సదస్సు విజయం వెనుక భారత్ ఇంకా పరిష్కరించుకోవాల్సిన కొన్ని కీలక సవాళ్లు మిగిలే ఉన్నాయి. భారత్ పురోగతి సాధించలేకపోయిన ముఖ్యమైన అంశం కూటమిలోని వివిధ సభ్యదేశాలతో వాణిజ్య లోటు. ఇది ఇప్పటికీ ప్రతికూల స్థితిలోనే ఉంది, ముఖ్యంగా చైనాతో వాణిజ్య అసమతుల్యత గణనీయంగా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సంక్లిష్టమైన తరుణంలో బ్రిక్స్‌కు ఆతిథ్యమివ్వడం కోసం భారత్ తన సొంత వాణిజ్య ప్రయోజనాలను కొంతమేర పక్కనబెట్టాల్సి వచ్చిందని కూడా చెప్పవచ్చు. దిగుమతి–ఎగుమతి లెక్కలను సమతుల్యం చేసుకోవడం ఒక సవాలుగా మిగిలింది. ద్వైపాక్షిక సమావేశాల్లో ఇచ్చిన హామీలను చేపట్టి, క్రమంగా దీన్ని పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. మరోవైపు, తదుపరి బ్రిక్స్ సదస్సుకు 2027లో చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో, న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో పేర్కొన్న చెల్లింపుల మౌలిక వసతులు, ఐఎంఎఫ్ సంస్కరణలు, బ్రిక్స్ పే ఏకీకరణ వంటి అంశాలు ఏమేరకు ముందుకు సాగుతాయన్నది ఆసక్తికరంగా మారింది. ప్రధాని మోదీ పదేపదే నొక్కిచెప్పినట్టుగా, బ్రిక్స్ కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కాకుండా, నిర్దిష్ట ఫలితాలను అందించే వేదికగా మారాలంటే, సభ్యదేశాల మధ్య ఆచరణాత్మక సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉంది. వాస్తవం ఏమిటంటే, రోజురోజుకూ మరింత బహుళధ్రువంగా మారుతున్న ప్రపంచంలో భారత్ తన ప్రతిష్ఠను మరింత మెరుగుపరుచుకోగలిగింది, పోటీ ప్రయోజనాలున్న రష్యా, చైనా వంటి పెద్ద శక్తులతో పాటు పాశ్చాత్య దేశాలతో సన్నిహిత సంబంధాలున్న దేశాలను కూడా ఒకే వేదికపైకి తీసుకురాగల తన దౌత్యనీతి సామర్థ్యాన్ని నిరూపించుకుంది. అయితే సదస్సుల ఆర్భాటం, హడావిడి సద్దుమణిగిన తర్వాత, ఆర్థిక వ్యవస్థ బలం సామాన్య ప్రజల సంక్షేమంలో, ఎక్కువమందికి ఉద్యోగాల రూపంలో ప్రతిఫలించాలంటే దేశీయంగా ఇంకా ఎంతో చేయాల్సి ఉందన్నది కూడా గుర్తుంచుకోవాలి. ■



బాధ మనిషిని ప్రగతి పథంలోకి నడిపించవచ్చు, లేదా పతనానికి కూడా కారణం కావచ్చు. ఆ బాధను భరించి ముందుకు సాగాలా, లేక దానిలోనే కూరుకుపోవాలా అన్నది పూర్తిగా మన ఎంపికపైనే ఆధారపడి ఉంటుంది. మనసు గాయపడేది కొన్ని క్షణాల పాటే --- కానీ ఆ గాయాన్ని జీవితాంతం మోస్తూ బతకాలా, లేక దాన్ని ఒక పాఠంగా మలుచుకుని ముందుకెళ్లాలా అన్నది మాత్రం మన నిర్ణయమే. చివరిగా చిన్న మాట.. బాధను అదుపులో ఉంచుకున్నవాడే బతుకును జయిస్తాడు. ఇది అనుభవజ్ఞుల మాట.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## సిగ్నల్ లైట్లే యుద్ధాస్త్రాలట!



సిగ్నల్ లైట్ ఎర్రబడితే ఆగాలి, పచ్చబడితే వెళ్లాలి, ఇదే మనకు తెలిసిన లాజిక్. కానీ ఇంగ్లండ్‌లోని డెవన్ కౌంటీలో మాత్రం కొందరికి సిగ్నల్ లైట్లే శత్రువులయ్యాయి! తమను తాము 'బ్లేడ్ రన్నర్స్' అని పిలుచుకునే ఒక వింత ముఠా, ఆధునిక ట్రాఫిక్ సిగ్నళ్లు నిజానికి రహస్య "ఎలక్ట్రానిక్ అసాల్ట్ వెపన్స్" అని నమ్ముతోంది. ఇవి గుండెపోటు, బ్రెయిన్ క్యాన్సర్, ఆకస్మిక మరణంలాంటివి కలిగిస్తాయని వారి ఫిర్యాదు! ఇల్‌ఫ్రకాంబ్ పట్టణంలో 60, 70 ఏళ్ల వయసున్న ఇద్దరు పెద్దమనుషులు నేరుగా సిగ్నల్ స్తంభంఎక్కి, సెన్సార్ వైర్లను కత్తిరించేశారు. అదృష్టవశాత్తూ సూపర్ హీరో యాక్షన్ కాకుండా, సీసీటీవీలో బంధీ అయ్యారు! ఈ వీడియో వైరల్ కాగానే పోలీసులు వీరిని అరెస్ట్ చేసి, వేల పౌండ్ల నష్టానికి కేసు పెట్టారు. అయినా బెయిల్ మీద బయటకొచ్చిన బ్లేడ్ రన్నర్స్, "మేం 'వోక్' కాదు, పూర్తిగా 'అవేక్!'" అంటూ సవాలు విసురుతున్నారు. మొత్తానికి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన సిగ్నల్ లైట్లే ఇప్పుడు "అనుమానిత నేరస్థులు" అయిపోయాయి!

## రెన్షా శతకం, ఇల్లిస్ విజృంభణ..

# తొలి వన్డే ఆసీస్‌దే..!

జింబాబ్వేలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆస్ట్రేలియా గెలుపుతో బోణీ కొట్టింది. హరారే వేదికగా ఇవాళ జరిగిన తొలి మ్యాచ్‌లో 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాటింగ్‌లో మ్యాట్ రెన్షా, బౌలింగ్‌లో నాథన్ ఇల్లిస్ సత్తా చాటి ఆసీస్‌ను గెలిపించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్, నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ మ్యాట్ రెన్షా? (109) సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. కూపర్ కన్నోలీ (51) కూడా రాణించాడు. కెప్టెన్ మిచెల్ మార్ష్ (36), ఒలివర్ పీక్ (30), అలెక్స్ క్యారీ (27) ఓ మోస్తరు స్కోర్లు చేయగా.. ట్రవిస్ హెడ్ (4), జోష్ ఇంగ్లిస్ (4), జేవియర్ బార్ట్‌లెట్ (5) నిరాశపరిచారు. జింబాబ్వే బౌలర్లలో న్యుమ్యాన్ న్యామ్హురి (5-62) ఐదు వికెట్లతో సత్తా చాటాడు. బ్రాడ్



ఈవాన్స్ 2, కెప్టెన్ సికందర్ రజా ఓ వికెట్ పడగొట్టాడు.

అనంతరం లక్ష్య ఛేదనలో జింబాబ్వే తడబడింది. నాథన్ ఇల్లిస్ (5-31) విజృంభించడంతో 45.1 ఓవర్లలో 235 పరుగులకే ఆలౌటైంది. స్పెన్సర్ జాన్సన్, జేవియర్ బార్ట్‌లెట్, రెన్షా, ఆడమ్ జంపా, కూపర్ కన్నోలీ తలో వికెట్ తీసి, జింబాబ్వే పతనంలో పాలుపంచుకున్నారు. జింబాబ్వే ఇన్నింగ్స్‌లో క్రెయిగ్ ఎర్విన్ (59), కెప్టెన్ సికందర్ రజా (57) అర్ధ సెంచరీలతో పోరాడినప్పటికీ, ఫలితం లేకుండా పోయింది. వీరికి మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. ఈ సిరీస్‌లో రెండో వన్డే సెప్టెంబర్ 18న ఇదే హరారే వేదికగా జరుగనుంది.

# సత్తా చాటిన టీమిండియా బౌలర్లు

న్యూఢిల్లీ వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న రెండో టీ20లో టీమిండియా బౌలర్లు సత్తా చాటారు. నితీశ్ కుమార్ రెడ్డి (3-0-24-3), అర్షదీప్ సింగ్ (4-0-35-2), జస్ప్రీత్ బుమ్రా (4-1-25-1), అక్షర్ పటేల్ (4-0-28-1), రవి బిష్ణోయ్ (4-0-32-1) చెలరేగడంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులకే పరిమితమైంది. ఆఖర్లో రషీద్ ఖాన్ (28) బ్యాట్ ఝులిపించడంతో ఆఫ్ఘన్ జట్టు ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. మిగతా ప్లేయర్లలో ఇబ్రహీం? జద్రాన్ 37, రహ్మానుల్లా గుర్బాజ్ 0, సెదిఖుల్లా అటల్ 12, గుల్బదిన్ నైబ్ 10, దర్విష్ రసూలీ 26, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 11, మొహమ్మద్ నబీ (15), నూర్ అహ్మద్ (7 నాటౌట్), ముజీబ్ ఉర్ రెహ్మాన్ 4 (నాటౌట్) పరుగులు చేశారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.



## స్పోర్ట్స్

### చేజారుతున్న సచిన్ రికార్డులు..
### సుదీర్ఘ కెరీర్‌తో చరిత్ర సృష్టించిన టేలర్..!



అంతర్జాతీయ క్రికెట్‌లో భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డులు వరసగా చేజారుతున్నాయి. ఇప్పటికే వన్డేల్లో అత్యధిక శతకాల యోధుడిగా విరాట్ కోహ్లీ అవతరించగా.. టెస్టుల్లో అత్యధిక హాఫ్ సెంచరీలతో జో రూట్ ముందంజ వేశాడు. ఇప్పుడు వన్డేల్లో సచిన్ పేరిట ఉన్న సుదీర్ఘ కెరీర్ రికార్డు కనుమరుగైంది. జింబాబ్వే ఆటగాడు బ్రెండన్ టేలర్ అత్యధిక సంవత్సరాల కెరీర్‌తో టీమిండియా వెటరన్‌ను రెండో స్థానానికి నెట్టేశాడు. ప్రపంచ క్రికెట్‌లో మరో రికార్డు బద్ధలైంది. సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌తో సచిన్ టెండూల్కర్‌ను బ్రెండన్ టేలర్(జింబాబ్వే) అధిగమించాడు. రెండు దశాబ్దాలకు పైగా వన్డేలను ఏలిన సచిన్ టన్నుల కొద్దీ పరుగులతో, నూరు శతకాలతో ఆల్‌టైమ్ రికార్డు తన పేరిట రాసుకున్నాడు. కానీ, సుదీర్ఘ కెరీర్ కొనసాగించిన ఆటగాడిగా మాత్రం రెండో స్థానానికి పడిపోయాడు. వన్డేల్లో మాస్టర్ బ్లాస్టర్ 22 ఏళ్ల 91 రోజులు ఆడగా.. ఇప్పుడు టేలర్ 22 ఏళ్ల 148 రోజులతో చరిత్ర సృష్టించాడు. టేలర్ 2004 ఏప్రిల్ 20వ తేదీన వన్డేల్లో అరంగేట్రం చేశాడు. అవినీతి కేసులో మూడేళ్ల నిషేధం అనంతరం పునరాగమనం చేసిన టేలర్.. మళ్లీ మైదానంలోకి దిగాడు. వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న టేలర్.. ఇప్పటికే సుదీర్ఘ కెరీర్‌తో సచిన్‌ను అధిగమించాడు. శ్రీలంక మాజీ ఆటగాడు సనత్ జయసూర్య మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ లంక వెటరన్ 21 ఏళ్ల 184 రోజులు వన్డే క్రికెట్ ఆడాడు.

**డ్రగ్స్‌కు బానిసై**

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్ కప్(2011) తర్వాత జింబాబ్వేకు సారథ్యం వహించిన టేలర్.. 2015 వరకూ కెప్టెన్‌గా కొనసాగాడు. అయితే.. అనూహ్యంగా 2021లో క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అందుకు కారణం డ్రగ్స్(ఉత్తీబస్త్రం), ఆల్కహాల్. ఈ రెండింటికీ బానిసగా మారిన అతడు రిహాబిలిటేషన్ కేంద్రంలో చేరాడు. అక్కడ నిపుణుల ప్రేరణతో టేలర్‌లో మార్పు వచ్చింది. మునపటి మనిషిలా మారిన అతడు ఇంటివద్దనే కుర్రాళ్లకు కోచింగ్ ఇవ్వడం ప్రారంభించాడు. ప్రస్తుతం వన్డే, టీ20లకు సారథులగా ఉన్న సియన్ విలియమ్స్(39 ఏళ్లు), సికిందర్ రజా(38 ఏళ్లు) తనకు స్ఫూర్తి అని చెప్పాడు టేలర్.

# ‘వారణాసి’ హైదరాబాద్ టూ అంటార్కిటికా జర్నీ!





ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా తెరకెక్కుతోన్న సంచలన చిత్రం ‘వారణాసి’. సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. కథా నేపథ్యం, విజువల్స్ పరంగా చిత్రం సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది. విభిన్నమైన సంస్కృతులు, భౌగోళిక వాతావరణాల కలబోతగా రూపొందుతున్న చిత్రం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక్కసారి ఈ సినిమా విశేషాల్లోకి వెళ్తే.. ఈ సినిమా చిత్రీకరణ ప్రయాణం భాగ్యనగరం హైదరాబాద్‌లోనే ఘనంగా ప్రారంభమైంది. అధునాతన సెట్లు, కీలక నటీనటులపై ప్రధాన సన్నివేశాల చిత్రీకరణను ఇక్కడే పూర్తి చేశారు. నిర్మాణ పరంగా అన్ని సౌకర్యాలు కలిగిన హైదరాబాద్ నుంచి మొదలైన సుదీర్ఘ ప్రయాణం, కథాగమనానికి అనుగుణంగా దేశవిదేశాల్లోని అనేక విభిన్న ప్రాంతాలకు విస్తరించడం విశేషం. హైదరాబాద్ షెడ్యూల్ అనంతరం చిత్ర బృందం ఒడిశాలోని ప్రకృతి రమణీయమైన చారిత్రక ప్రాంతాలకు చేరుకుంది. అక్కడ అందుబాటులో ఉన్న సహజసిద్ధమైన లొకేషన్లు, దట్టమైన అడవులు మరియు తీర ప్రాంతాల్లో కీలక ఘట్టాలను చిత్రీకరించారు. ఒడిశాలోని ప్రత్యేక వాతావరణం సినిమాకు కావాల్సిన రా అండ్ రియలిస్టిక్ లుక్‌ను అద్భుతంగా అందించింది. అక్కడి నుంచి ప్రాజెక్ట్ గ్లోబల్ లెవెల్‌కు రీచ్ అయింది. ఆఫ్రికా ఖండంలోకి ప్రవేశించింది. ఆఫ్రికాలోని విలక్షణమైన భూభాగాలు, ఎడారి ప్రాంతాలు , సహజ అడవుల నేపథ్యంలో శ్రమతో కూడుకున్న యాక్షన్ సన్నివేశాలను రూపొందించారు. హాలీవుడ్ చిత్రాలకు తగ్గకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఆఫ్రికాలో తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయనడంలో సందేహం లేదు.

అన్నింటికంటే ప్రసిద్ధమైన అత్యంత సాహసవంతమైన ఘట్టం అంటార్కిటికా షెడ్యూల్. అత్యంత ప్రతికూల వాతావరణం, సున్నా కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న అంటార్కిటికా మంచు ఖండంలో షూటింగ్ జరపడం అరుదైన మైలురాయి. రికార్డు స్థాయిలో అత్యంత కష్టతరమైన పరిస్థితులను తట్టుకుని అక్కడ సాధించిన చిత్రీకరణ, విజువల్ పరంగా భారతీయ ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. హైదరాబాద్ టూ అంటార్కిటికా వరకు సాగిన ప్రయాణం లో కొంత భాగం మాత్రమే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఏడాది చివరికల్లా మిగతా చిత్రీకరణ పూర్తి చేస్తామని జక్కన్న ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రదేశాల్లో.. ఇంకెన్ని దేశాల్లో షూటింగ్ జరుతుందన్నది ఆసక్తికరం. సినిమాకు సంబంధించి ఇంకా షూట్ చేయాల్సిన కీలకమైన సన్నివేశాలు చాలా ఉన్నాయి. వాటి కోసం సిటీలోనే ప్రత్యేకంగా సెట్లు నిర్మిస్తున్నారు. అవపసరం మేర ఔట్ డోర్...ఆ సన్నివేశాలు డిమాండ్ చేసే విదేశీ లొకేషన్లను షూటింగ్ నిర్వహించనున్నారు.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com